J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 42 సంచిక : 42 24.03.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

# మేల్కోకపోతే కోల్పోక తప్పదు!

## వైసీపీకి వరుస నష్టాలు

## మొన్న 3... నేడు 1 చేజారిన ఎమ్మెల్సీలు

- 108పై ఉన్న వైసీపీ.. ఐసియుకి వెళ్లకుండా చూసుకోవాలి
- నాయకత్వంపై చాపక్రింద నీరులా ఉన్న వ్యతిరేకత
- నిధులు లేకపోతే మేమేం చేయగలం అంటూ నేతల నిట్టూర్పు
- తప్పంతా అధినాయకుడిపై నెట్టేస్తున్న పార్టీ నేతలు



"మాట్లాడేవాళ్ళు ఓట్లెయ్యరు, కాబట్టి మాకు దిగులులేదు. మమ్మల్ని విమర్శిస్తున్న మేధావి వర్గం ఓటింగుకు రాదు, కాబట్టి మాకు ధోకా లేదు. మేం పథకాల రూపంలో లక్షల కోట్లు ప్రజల ఖాతాలో నేరుగా వేస్తున్నాం... కాబట్టిమాకు భయంలేదు. నోట్లు తీసుకున్నవారి ఓట్లన్నీ మా ఖాతాలోనే పడిపోతాయి... కాబట్టి ఖచ్చితంగా విజయం మాదే."

ఇవీ అధికార పార్టీ వైసీపీ నేతలు చెప్తున్న మాటలు. ఇదీ వారి ధీమా.



శుభాకాంక్షలు

పాఠకులకు, ప్రకటనకర్తలకు, చందాదారులకు, మిత్రులకు శ్రేయోభిలాషులకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు.

- సం/-

మరి మొన్న రాష్ట్రంలో మూడు రీజియన్లలో, 9 జిల్లాలలో, 108 నియోజక వర్గాలలో జరిగిన శాసనమండలి ఎన్నికలలో ఓట్లేసిందంతా మేధావులే. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు చెప్పినవారంతా చదువుకున్నవారే. మేధావుల నియోజకవర్గానికి ఎన్నికలు జరిగిన 9 జిల్లాలలోనూ ఓటెత్తింది వైసీపీ పాలనని విమర్శిస్తూ మాట్లాడేవారే.

### నెల్లూరు నుండే అదురుదెబ్బ...!

23వ తేదీ గురువారం జరిగిన ఎం.ఎల్.సీ ఎన్నికలలో వైసీపీకి మరో అదురుదెబ్బ తగిలింది. అయితే ఎంఎల్ఏల కోటా 3లో



# అధికారానికి 'అయ్యవార్ల' ఓటు
# ప్రతిపక్షానికి 'పట్టభద్రుల' చోటు

రాష్ట్రంలో జరిగిన ఉపాధ్యాయులు, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఫలితాలు రాజకీయ విశ్లేషకులకు అంతుచిక్కని విధంగా వచ్చాయి. ప్రభుత్వానికి పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారని రాష్ట్రమంతా కోడైకూస్తున్న అయ్యవార్లు మాత్రం అధికార పార్టీకే తమ మద్దత్తు తెలిపారు. పేరుకి ప్రైవేట్ టీచర్ల ఓట్లు కూడా ఈ విజయానికి తోడయ్యాయని పైకి చెప్పుకున్నా, ప్రభుత్వ ఉపాధ్యాయుల ఓట్లు ఇక్కడ కీలకమే. రాష్ట్రంలోని అక్షరాస్యులంతా జగన్‌మోహన్‌రెడ్డికే జై కొడతారనుకున్న వారి అంచనాలు తారుమారయ్యాయి. పట్టభద్రులంతా చంద్రబాబు జిందాబాద్ అన్నారు. 3 లో







శ్రీరామ నవమి శుభాకాంక్షలు

శ్రీ సాయి కంచి

రోడ్ నెం.2, 2వ మెయిన్‌రోడ్డు, మాగుంట లే అవుట్, నెల్లూరు. సెల్ : 8919714848.




# ఎన్‌సిసి 'పునీత్ సాగర్ అభియాన్'

10వ ఆంధ్ర నేవల్ యూనిట్ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులోని 'స్వర్ణాలచెరువు' వద్ద 'పునీత్ సాగర్ అభియాన్' కార్యక్రమం నిర్వహించి అక్కడున్న చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, ఆ ప్రాంతాన్నంతా పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అసోసియేట్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ నదులు, సముద్రాలు, చెరువులు, సరస్సులు, కొలనులను పరిశుభ్రంగా ఉంచుకోవడమే పునీత్ సాగర్ అభియాన్ ప్రధాన లక్ష్యమని చెప్పారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించాలనే ధ్యేయంతో ఎన్‌సిసి క్యాడెట్ల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. సిబ్బంది రాకేష్‌కుమార్, సమోటా, ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# వెంగారెడ్డిపాళెం స్కూల్‌లో సరస్వతీ పూజ

సంగం మండలం వెంగారెడ్డిపాళెం మెయిన్‌స్కూల్‌లో ఉగాదిని పురస్కరించుకుని ఇటీవల గ్రామ సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో సరస్వతీ పూజ నిర్వహించారు. అనంతరం దాత పాటూరు శ్రీనివాసమ్మను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు ఈశ్వ రయ్య, ఏఎన్ఎం రాజమ్మ, సుగుణమ్మ, వాణి తదితరులు పాల్గొన్నారు.

## 26న 'నెరసం'..


# జాతీయస్థాయి కవిసమ్మేళనం

శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మార్చి 26 ఆదివారం రోజున ఉదయం 9 నుంచి రాత్రి 9 గంటల వరకు జాతీయస్థాయి కవిసమ్మేళనం, ఉగాది పురస్కారాల సభ నిర్వహిస్తామని ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ.జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ తెలిపారు. డా. భూసురపల్లి వెంకటేశ్వర్లు(గుంటూరు)కు ఉగాది పురస్కారం, మెట్టు రామచంద్రప్రసాద్‌కు 'పద్య కళానిధి', డాక్టర్ పెళ్ళకూరు జయప్రదకు 'నెల్లూరుజిల్లా తొలి నవలా రచయిత్రి'గా బిరుదు ప్రదానం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 11 నుంచి 12 గంటల వరకు సభా కార్యక్రమం, అనంతరం పలువురికి నెరసం సాహిత్య సేవా పురస్కారాలను బహుకరిస్తామని, ఆ తర్వాత కూడా కవి సమ్మేళనం కొనసాగుతుందని పేర్కొన్నారు.



# 'పెరసం' ఉగాది పురస్కారాలు

శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని పెరసం (పెన్నా రచయితల సంఘం) ఆధ్వర్యంలోమార్చి 19వ తేదిన ఉగాది వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక నెల్లూరు హాస్పిటల్ సమావేశమందిరంలో 'ఉగాది కవి సమ్మేళనం' జరిగింది. 30 మందికి పైగా కవులు, కవయిత్రులు పాల్గొని ఉగాది ప్రాశస్త్యంతోపాటు, సామాజిక అంశాలపై కవితాగానం చేశారు. 'పెరసం' వ్యవస్థాపక అధ్యక్షుడు మోపూరు పెంచల నరసింహం, ప్రధాన కార్యదర్శి తోట సులోచన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తమ తల్లితండ్రులు స్వర్గీయ తోట చెంచులక్ష్మమ్మ-గురుమూర్తిల స్మారకంగా తోట సులోచన ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందజేశారు. ప్రముఖ కవులు పెళ్ళూరు సునీల్, పల్లాపు రాము, ప్రముఖ రచయిత్రి నాగ గాయత్రి ఈ పురస్కారాలను అందుకున్నారు. పద్యకళాపరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్, నెరసం ప్రధాన కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, ప్రముఖ బాలసాహితీవేత్త డా.గంగిశెట్టి శివకుమార్, 'లాయర్' వారపత్రిక సబ్ ఎడిటర్ మద్దూరు శ్రీనివాసులు తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ప్రముఖ కవులు హస్తి లక్ష్మణరాజు, మోహన్, హన్సిక, నగ్మా, విజిత, ఇంద్రగంటి మధుసూదనరావు, మాటేటి రత్నప్రసాద్, ఇసనాక దయాకర్‌రెడ్డి, భక్తకవి పెనగలూరు తదితరులు కవిసమ్మేళనంలో పాల్గొన్నారు. అనంతరం, మోపూరు పావని జ్ఞాపకార్థం మోపూరు పెంచలనరసింహం కవులకు జ్ఞాపికలు బహుకరించారు.




# శభాష్ చంద్రబోస్



కవి గాయక నట వైతాళికులలో
కవిది ప్రథమ స్థానం
అతి తక్కువమంది
సినీ పాటల రచయితల్లో
ఆయనదే విశిష్ట స్థానం!
కవి కలం నుంచి శిశువులా
జనించిన పాటకు
సాంకేతిక సహకారంతో
హంగుల రంగులతో
వైభవంగా సినీ చిత్రీకరణం!
'మంచు కొండల్లో 'చంద్ర'మా'
తాజ్‌మహాలులో
ప్రథమ గీతంతో ప్రవేశించి
మై ఆటో గ్రాఫ్ విత్ స్వీట్ మెమరీస్‌లో
'మౌనంగా ఎదగమని
మొక్క నీకు చెపుతుందని 'ప్రబోధించి
మరెన్నో వందలాది పాటలతో
సాహిత్య శోభతో అలరించి
వంద సంవత్సరాలనాటి
వాడుక మాటలను పాటగా
ఆర్ఆర్ఆర్‌లో అద్భుతంగా
నాటుగా..నీటుగా మలచి
ప్రేక్షకుల్లో రసానుభూతిని కలిగించి
వివిధ దేశాల సినీ మేధావుల తీర్పుతో
'తెలుగుపాటకు' విజయం వరించి
అమెరికాలో ఆ పాట ప్రాభవం
ప్రపంచమంతా పరిమళించి
రాజసంతో వాణీ హితుడవై
ప్రపంచ సినీ 'పాట'ల ఆకాశంలో
నిండుపున్నమి చంద్రుడిలా
ప్రకాశిస్తూ
అద్వితీయమైన ప్రపంచస్థాయి
పురస్కారం
'ఆస్కార్ అవార్డు'ను సాధించి
'శభాష్ చంద్రబోస్' అనిపించుకున్న
ప్రఖ్యాత సినీకవి చంద్రబోస్‌కు
వందనం...అభివందనం!

- ఇసనాక దయాకరరెడ్డి
ఫోన్ : 970181 5056




భారత ప్రభుత్వ రక్షణ శాఖ సాంకేతిక సలహాదారుడు, మన నెల్లూరీయుడు గుండ్రా సతీష్‌రెడ్డి మార్చి 23వ తేదీ గురువారం తిరుపతిలో టిటిడి ఆధ్వర్యంలో నిర్వహింపబడే ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులతో ముచ్చటించి ఆయుర్వేద వైద్యవిధానాల గురించి తెలుసుకున్నారు.



## గురువు వద్దకి శిష్యుడు

పూర్వ ఉపరాష్ట్రపతి మన ముప్పవరపు వెంకయ్యనాయుడు 23వతేది గురువారం ఉదయం ఢిల్లీలోని లాల్‌కృష్ణ అద్వాని నివాసానికి వెళ్ళి ఆయనతో కాసేపు గడిపి వచ్చారు. రాజకీయ జీవితంలోను, వ్యక్తిగత జీవితంలోను, ప్రజాజీవితంలోనూ అన్ని విధాలుగా స్ఫూర్తిదాతగా నిలిచి తనను ప్రభావితం చేసిన గురువుగా భారతీయ జనతా పార్టీ నాయకులు అద్వానీజీతో తన గత స్మృతులను ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకం చేసుకున్నారు.

# అధికారానికి 'అయ్యవార్ల' ఓటు ప్రతిపక్షానికి 'పట్టభద్రుల' చోటు

(మొదటి పేజీ తరువాయి)

రెండు పార్టీలు ఓడిపోతాయనుకున్న చోట గెలవడం, గెలుస్తాయనుకున్న చోట ఓడిపోవడంతో విశ్లేషకుల అంచనాలు తారుమారయ్యాయి. తూర్పు రాయలసీమ నుండి శాసన మండలి సభ్యులుగా ఎన్నికైన ఇద్దరు అభ్యర్థుల జీవిత విశేషాలు ఒకసారి గమనిద్దాం.

## ఉపాధ్యాయుల నియోజకవర్గ అభ్యర్థిగా నెగ్గిన పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి



ఇటీవల జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వైకాపా తరఫున విజయం సాధించారు. ఆయన స్వస్థలం తిరుపతి జిల్లా(పాత నెల్లూరుజిల్లా) చిల్లకూరు మండలంలోని వల్లిపేడు గ్రామం. తండ్రి పేరు పర్వతరెడ్డి సుందరరామిరెడ్డి, తల్లి పేరు సుజాతమ్మ. ప్రస్తుత నివాసం నెల్లూరు. జూన్ 26, 1972లో చంద్రశేఖర్‌రెడ్డి జన్మించారు. 1987లో నెల్లూరులోని డిసిఆర్ జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుకున్నారు. 1989-92లో నెల్లూరు సర్వోదయ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి, 1994లో తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ, అనంతరం ఎంబిఏ పూర్తి చేశారు. నెల్లూరులోని కృష్ణచైతన్య విద్యాసంస్థల ఛైర్మన్‌గా ఆయన లబ్ధప్రతిష్టులు. చిన్నతనం నుంచి ఆయనకు సేవాభావంపై మక్కువతో ఉండేవారు. గత 24ఏళ్లుగా, ఈ విద్యాసంస్థల ద్వారా తక్కువ ఫీజుతో ఎందరో పేదవిద్యార్థులకు విద్యనందిస్తున్నారు. అన్నిటికీ మించి రెడ్‌క్రాస్ సొసైటీకి జిల్లా ఛైర్మన్‌గా ఉంటూ జిల్లావ్యాప్తంగా అనేక బృహత్తరమైన సేవా కార్యక్రమాలను ఆయన చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా ఖ్యాతినందుకున్నారు. ప్రత్యేకించి కరోనా సమయంలో ఆయన సారథ్యంలో రెడ్‌క్రాస్ సేవలకు రాష్ట్రస్థాయిలోనే కాక, దేశస్థాయిలోనూ మంచి గుర్తింపు లభించింది. కోవిడ్ వ్యాధిగ్రస్తులకు ప్లాస్మా అందించడం, ఆక్సిజన్ వాహనాల ద్వారా ఆక్సిజన్ బెడ్లు ఏర్పాటు చేయడం, ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు అందజేయడం, కోవిడ్‌తో మరణించిన మృతదేహాలకు గ్యాస్ ఆధారిత మొబైల్ క్రిమిటోరియం మిషన్ ద్వారా దహన సంస్కారాలు చేయడం, కోవిడ్ బాధితులకు మందులు, వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం.. ఇలా అనేక రకాల సేవా కార్యక్రమాలను చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టి నెల్లూరు రెడ్‌క్రాస్‌కు ప్రత్యేకగుర్తింపు తీసుకొచ్చారు. ఆ విశిష్టసేవలకు గుర్తింపుగా 2022, ఏప్రిల్‌లో అప్పటి రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ నుంచి 'ఉత్తమ అవార్డు'ను కూడా అందుకున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గ అధికారపార్టీ అభ్యర్థిగా అదృష్టం ఆయనను వెతుక్కుంటూ వచ్చి ఎం.ఎల్.సిని చేసింది.

## మేధావుల నియోజకవర్గ అభ్యర్థిగా గెలిచిన కంచర్ల శ్రీకాంత్



పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మద్దతుతో గెలుపొందిన కంచర్ల శ్రీకాంత్ చౌదరి స్వస్థలం నెల్లూరుజిల్లా కందుకూరు నియోజకవర్గం, వలేటివారిపాళెం మండలంలోని అత్తంటివారిపాళెం గ్రామం. తండ్రి పేరు కంచర్ల రామయ్య. 1980 జులై 25న ఆయన జన్మించారు. 2005లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో బిటెక్, 2017లో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంబిఏ పూర్తి చేశారు. 2018లో యూనివర్సిటీ ఆఫ్ ఆసియా నుంచి డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం ప్రకాశం ఎడ్యుకేషన్ గ్రూప్ డైరెక్టర్‌గా, కంచర్ల ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ కోశాధికారిగా కూడా వ్యవహరిస్తున్నారు. 2009 నుంచి తెలుగుదేశం పార్టీలో చురుగ్గా పనిచేస్తూ, 2014లో కందుకూరు నుంచి టిడిపి తరఫున జడ్పీటీసీ సభ్యునిగా పోటీచేసి విజయం సాధించారు. పేద విద్యార్థులకు ఆర్థికసాయం చేయడంతో పాటు, ప్రభుత్వ కళాశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం ఆయనకెంతో ఇష్టం. 2021లో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఎన్నికైన శ్రీకాంత్, ఆ పార్టీ తరఫున ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి విజయం సాధించారు.



## ఐపీఎల్ క్రికెట్ జోనల్ ఆపరేషన్స్ మేనేజర్‌గా మాజీ ఐపీఎస్ ఈతముక్కల దామోదర్

జిల్లా ఎస్.పీగా నెల్లూరీయులకు సుపరిచితులు, మాజీ ఐపీఎస్ అధికారి ఈతముక్కల దామోదర్‌కి అరుదైన అవకాశం లభించింది. బీసీసీఐ దామోదర్‌ని 2023లో జరగబోయే ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి జోనల్ ఆపరేషన్ మేనేజర్‌గా ఎంపిక చేసింది. ఈ మొత్తం ఆటలకిగాను ముగ్గురు జోనల్ ఆపరేషన్ మేనేజర్‌లను నియమించగా వారిలో దామోదర్ ఒకరు. 2023 ఏప్రిల్ 1వతేదీ నుండి. లక్నో, బెంగళూరు, గౌహతి, మొహాలీ, ముంబై, చెన్నై, జైపూర్, ఢిల్లీ నగరాలతో పాటు అహ్మదాబాద్‌లలో జరిగే మ్యాచ్‌లకు దామోదర్ ఈ జోనల్ ఆపరేషన్ మేనేజర్ బాధ్యతలను నిర్వహిస్తారు. పోలీసు శాఖలో ఉన్నప్పుడు ప్రతిభావంతమైన అధికారిగా గుర్తింపు పొందిన దామోదర్‌కి లభించిన అరుదైన అవకాశం ఇది. ఆయన నియామకం పట్ల ఆయన సన్నిహితులు, స్నేహితులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. దామోదర్‌కి 'లాయర్' అభినందనలు.

# మేల్కోకపోతే కోల్పోక తప్పదు!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి జరిగిన ఎంఎల్‌సీ ఎన్నికల్లో నెల్లూరుజిల్లా నుంచే అదురుదెబ్బ తగలడం ఆలోచించవలసిన విషయం. 2014, ఆ తరువాత 2019లో కూడా వైసీపీకి కంచుకోట నెల్లూరు జిల్లా. ఇక్కడ ఎన్నికలు ఏకపక్షంగా జరిగాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన కార్పొరేషన్ ఎన్నికలలో కూడా వైసీపీ మొత్తం 54కి 54సీట్లు తన ఖాతాలో వేసుకుంది. అలాంటి నెల్లూరు జిల్లానే ఇప్పుడు ఎం.ఎల్.ఏల కోటాలో జరిగిన శాసనమండలి ఎన్నికలలో పార్టీని అదురుదెబ్బ కొట్టింది. పార్టీకి వ్యతిరేకంగా 4ఓట్లు పోలైతే వాటిలో ముగ్గురు నెల్లూరు జిల్లాకి సంబంధించిన వారు కావడం గమనార్హం. వెంకటగిరి ఎంఎల్‌ఏ ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఏ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇప్పటికే బహిరంగంగానే పార్టీకి దూరమయ్యారు. వీరిద్దరూ టీడీపీ అభ్యర్థి అనూరాధకే ఓటు వేసివుంటారని భావించవచ్చు. ఇప్పటికే 2019లో టీడీపీ గుర్తుపై గెలిచిన ఇరవై ముగ్గురిలో నలుగురు శాసనసభ్యులు టీడీపీకు దూరమయ్యారు. వైసీపీతో ప్రయాణం చేస్తున్నారు. జనసేన ఎంఎల్‌ఏ రాపాక వరప్రసాద్ కూడా వైసీపీతోనే జతకట్టారు. ఆ విధంగా.. వీరితో కలిపి వైసీపీకి 156మంది సభ్యులు ఉన్నారు. తెలుగుదేశానికి మిగిలిన 19 మందితో రామనారాయణరెడ్డి, శ్రీధర్‌రెడ్డిలను కలిపితే 21 ఖచ్చితంగా ఉన్నాయన్నది జగమెరిగిన సత్యమే. ఒక్క ఓటు పడితే అనురాధ గెలిచిపోతుందన్న ఉత్కంఠ అందరిలో ఉండింది. అయితే అనూహ్యంగా ఆమెకు 23 ఓట్లు వచ్చాయి. అంటే అధికారపార్టీ అండతో గెలిచిన అందరి అభ్యర్థులకంటే ఒక ఓటు ఆమెకు ఎక్కువ వచ్చింది. ఆ ఒక్కరు ఎవరు..? అన్న మీమాంస నుండి ఇప్పుడు ఆ ఇద్దరూ ఎవరు..?? అనే చర్చ మొదలయ్యింది. అయితే వీరిలో ఒకరు ఖచ్చితంగా ఉదయగిరి శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అన్న అనుమానాలు పార్టీ వర్గాలే వ్యక్తం చేస్తున్నాయి. ఆ రెండవ వ్యక్తి ఉండవల్లి శ్రీదేవి అన్న ఊహాగానాలు జోరుగా సాగుతున్నా, ఖచ్చితమైన సంకేతాలు రావడంలేదు. ఏడుగురు సభ్యులు సునాయాసంగా గెలవగలిగిన పరిస్థితిలో ఉన్న వైసీపీ, ఇప్పుడు ఆరుగురినే గెలిపించుకోగలిగింది.

టీడీపీ గెలుపుకు అవసరమైన దానికంటే ఒక ఓటు అదనంగా రావడం విశేషంగా పరిశీలకులు భావిస్తున్నారు. ఆనం, కోటంరెడ్డి కాకుండా వైసీపీకి వ్యతిరేకంగా ఓటేసిన వాళ్ళని కనుక్కున్నామని, వాళ్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని పార్టీ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి మీడియా ముందుకి వచ్చి చెప్పారు.

ఇప్పుడు నిజానికి సజ్జల ముందున్న సవాలు అది కాదు. పార్టీపై ఎక్కడ వ్యతిరేకత ఉంది...? చాపక్రింద నీరులా పార్టీపై వ్యతిరేకత ఎందుకు పెరుగుతోంది...? మేధావులు తమ పార్టీ విధానాలను ఎందుకు వ్యతిరేకిస్తున్నారు..? ఒక్కొక్కరుగా శాసన సభ్యులు పార్టీకి ఎందుకు దూరమవుతున్నారు...? ఇలాంటి అనేక ప్రశ్నలకి సజ్జల సమాధానాలు అన్వేషించాలి. పట్టభద్రుల ఎన్నికలలో 108 నియోజకవర్గాల్లో వ్యతిరేక ఓటుతో ఇప్పటికే పార్టీ 108పైకి చేరింది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఐసీయూకి చేరే ప్రమాదముంది. క్షేత్రస్థాయిలో చాలామంది పార్టీ నాయకులు బహిరంగంగానే పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. తమ అధినాయకుడు నిధులు మంజూరు చేయడంలేదు, వ్యక్తిగతంగా కలసి నియోజకవర్గ సమస్యలు చెప్పుకుందామంటే అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదంటూ... తప్పంతా తమ ముఖ్యమంత్రిదే అన్నట్లుగా చిత్రీకరిస్తున్నారు. ఈ పార్టీలో శాసనసభ్యులకు అసలు విలువే లేదన్న అసంతృప్తి చాలామందిలో ఉంది. రాక, రాక వచ్చిన అవకాశాన్ని ఇద్దరికి మరో ఇద్దరు తోడై శాసనమండలి ఎన్నికలలో తమ విలువేంటో చూపించారు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. రాజకీయం రాజకీయంలాగే చేయాలి. ప్రతి విషయంలోనూ 'రాజనీతి' పాటించాలి. ఇప్పటికైనా మేల్కోకపోతే భవిష్యత్తులో అధికారం కోల్పోక తప్పదు.

ఈ ఓటమి నుంచి వైసీపీ ఏ రకమైన పాఠాలు నేర్చుకుంటుందన్నది ఆ పార్టీ భవిష్యత్ నడకపై ఆధారపడి ఉంటుంది. టీడీపీ శ్రేణులకు మాత్రం మొన్నటి పట్టభద్రుల ఎన్నికలు, నేటి శాసన మండలి ఎన్నిక జీవన్‌టోన్‌లాంటివి. టక్కుటమార విద్యలన్నీ తెలిసిన రాజకీయ చాణుక్యుడు చంద్రబాబు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటారనడంలో సందేహం లేదు. మొత్తానికి గత రెండువారాలలో రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాలు తెలుగుదేశంపార్టీ శ్రేణులలో ఆశలు చిగురింపచేశాయనడంలో సందేహం లేదు.

### శాసనసభ్యుల కోటాలో శాసనమండలికి ఎన్నికైన అభ్యర్థులు వీరే :

మర్రి రాజశేఖర్(వైసీపీ), సూర్యనారాయణరాజు(వైసీపీ), జయమంగళ వెంకటరమణ(వైసీపీ), బొమ్మి ఇజ్రాయిల్(వైసీపీ), పోతుల సునీత(వైసీపీ), యేసు రత్నం(వైసీపీ), పంచుమర్తి అనురాధ(టీడీపీ).

లాయర్
మార్చి 24, 2023

# 'అటవీ సంరక్షణ'..మాటలకే పరిమితమా?

అడవులను సంరక్షించుకోవాలని, 'వన సంరక్షణ-మన సంరక్షణే'నని, చెట్లు ప్రగతికి మెట్లని, ప్రకృతి సంపదను కాపాడుకోవాలని నిత్యం శుద్ధులు చెప్పుకుంటూ ఉంటున్నామే కానీ, ఆచరణలో అవన్నీ మాటలకే పరిమితమైపోతున్నాయా అనిపిస్తోంది..నేటి అడవుల స్థితిగతులను చూస్తే. ఎన్నో అద్భుతమైన వృక్షాల రాశి..అడవంటే. జంతువులకు, పక్షులకు, మానవులకు, సకల జీవరాశులకు కూడా ఆవాసం..అడవంటే. ఆ ప్రకృతి మనకిచ్చిన వరప్రసాదం..అడవంటే!..అయినా, మనం కల్పతరువుల్లాంటి అలాంటి అడవులన్నీ మానవుల అవసరాల కోసం ధ్వంసమైపోతుండడం, అడవుల విధ్వంసం నేటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగిపోతూనే ఉండడం విచారకరం. మనిషికి జవమిచ్చి, జీవమిచ్చే ప్రకృతిని, ఆ ప్రకృతికి నిలయంగా ఉన్న అడవులను మనిషే చేజేతులా నాశనం చేసుకోవడం బాధాకరం. సమస్త జీవులు ఈ భూమ్మీద మనుగడ సాగించడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అడవులే కారణమన్నది అందరికీ తెలిసిందే. పచ్చదనం లేకపోతే, పర్యావరణ సమతుల్యతే లేకుంటే మానవ మనుగడకే ప్రమాదం. వర్షాలు సకాలంలో కురవాలన్నా, ముఖ్యంగా భూమి మీద సెగలుపొగలు తగ్గాలన్నా, రుతువులన్నీ క్రమబద్ధంగా ఉండాలన్నా పర్యావరణ సమతుల్యత ఎంతో అవసరం.అయితే మానవులు అవేమీ పట్టించుకోకుండా ఎప్పటికప్పుడు తమ అవసరాల కోసం రానురాను అడవులను విచక్షణ లేకుండా నరికేయడం వల్ల అడవులు క్షీణించిపోయి, చివరికి మానవ మనుగడకే ప్రమాదకరంగా మారుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణీకరణ పెరిగిపోవడం, పారిశ్రామికీకరణ, జనాభా పెరిగిపోయి ఆవాసాల కోసం అడవులను నరికేయడం వంటివే కాక, గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లుగా మరోవైపు కార్చిచ్చులు, అగ్నిప్రమాదాలు, అడవులకు నిప్పు పెట్టడాలు వగైరాలన్నీ కలిసి వెరసి అడవులకు పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. మరోవైపు, అడవుల్లో ఉన్న సహజసంపదను కొల్లగొట్టుకుపోయే అక్రమార్కుల ఆగడాలు కూడా మితిమీరిపోతూనే ఉన్నాయి. అయినా ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. మానవుడి తప్పిదాల వల్ల ప్రపంచవ్యాప్తంగా అడవుల విస్తీర్ణం రానురాను తగ్గిపోతూనే ఉందని, భూమి మీద, పర్వతప్రాంతాల్లో కూడా అడవులు క్షీణించిపోతున్నాయని పర్యావరణ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. భూమండలం మీదున్న పర్వత ప్రాంతాల్లో దాదాపు 271 కోట్ల ఎకరాల దాకా అటవీప్రాంతా లుండేవి. అవి కూడా నానాటికీ పెద్దమొత్తంలో కరిగిపోతూనే ఉన్నాయి. ప్రధానంగా పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాల వల్ల, మానవుని స్వార్థం వల్ల అడవులు తగ్గిపోతున్నాయి. ప్రపంచంలో ప్రతి ఏటా 13 మిలియన్ హెక్టార్లకు పైగానే అడవులు నాశనం అవుతున్నాయమంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. భూమిపైనున్న మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో 33 శాతం అడవులు ఉండాలని, అయితే 22 శాతం కూడా మించకపోవడం మనిషి అల సత్వానికి కారణమని చెప్పకనే చెప్పినట్లయింది. అడవులను విధ్వంసం చేసుకోవడం వల్లనే పెద్దఎత్తున కాలుష్యం ఏర్పడుతోందని, ప్రపంచ కార్బన్ ఉద్గారాలలో దాదాపు 18 శాతం దాకా పెరగడానికి అడవులను సంరక్షించుకోకపోవడం వల్లనేనని నిపుణులు చెప్తున్నారు.

అందుకే.. ఇకనైనా అడవుల పునరుద్ధరణ కోసం, అటవీ సంరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి మార్చి 21వ తేదీని అంతర్జాతీయ అటవీదినోత్సవంగా ప్రకటించింది. దీంతో అడవుల విశిష్టతను ప్రపంచ ప్రజలకు తెలిసేలా అన్నిదేశాల్లో అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రజలు అడవులను రక్షించుకోవడమే కాక, మొక్కలను విస్తారంగా నాటి సంరక్షించుకోవాలన్నది ధ్యేయం. అందులో అందరం భాగస్వాములం కావాలి. ప్రభుత్వాలతో పాటు, దేశంలోని ప్రతివ్యక్తీ తనవంతు బాధ్యతగా మొక్కల పెంపకం చేపట్టాలి. ప్రకృతిని, పచ్చదనాన్ని కాపాడుకోవాలి. తద్వారా హరిత పతాకం దేశవ్యాప్తంగా రెపరెపలాడాలి. మాటల్లో రక్షణ, చేతల్లో భక్షణ అనే విధంగా కాకుండా అడవుల రక్షణకు, పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో కంకణం కట్టుకోవాలి. 'అప్పుడే 'వృక్షో రక్షతి.. రక్షితః' (వృక్షాలను మనం రక్షిస్తే వృక్షాలు మనల్ని రక్షిస్తాయి) అన్నట్లుగా, అడవులను మనం కాపాడుకుంటే అడవులు కూడా మనల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటాయి. భూమాత చల్లగా ఉంటే, మనమంతా చల్లగా ఉన్నట్లే!...

**(మార్చి 21..ప్రపంచ అటవీ దినోత్సవం)**

# గురువులకన్నా శిష్యులే మేలనిపించారు..!




తాజాగా జరిగిన శాసనమండలి ఎన్నికలపై గత వారం నేను రాసిన లేఖను ప్రజావాణిలో ప్రచురించి, నా అభిప్రాయాన్ని గౌరవించిన 'లాయర్' పత్రిక వారికి నా ధన్యవాదాలు. ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎన్నికల ఫలితాలు చూసిన తరువాత చదువుచెప్పే గురువుకన్నా చదువుకున్న శిష్యులే మేలనిపించారనిపించింది. గ్రాడ్యుయేట్‌లు తమకున్న సామాజిక పరిజ్ఞానంతో విజ్ఞతతో ఓటేశారు. విద్యాబుద్ధులు నేర్పించే అధ్యాపకులు మాత్రం నోటుకి అమ్ముడుపోయారు. ప్రభుత్వ విధానాల పట్ల, విద్యారంగంలో ప్రభుత్వం అవలంభిస్తున్న వింత పోకడ పట్ల తీవ్ర వ్యతిరేక స్వరం వినిపిస్తున్న ఉపాధ్యాయులు అవన్నీ పక్కనపెట్టి అధికారపార్టీకే మద్దత్తు పలికారు. అంటే నోటుకి ప్రాధాన్యతనిచ్చి ఓటేశారన్నది స్పష్టమైపోయింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము చేసిన, చేస్తున్న పోరాటాన్ని అయ్యవార్లు మరచిపోయారు. అర్థం పరమార్థం లేని ఉచితాలతో, విచ్చలవిడి డబ్బు పంపకాలతో ప్రజలను సోమరిపోతులుగా తయారుచేస్తున్న అధికారపార్టీ అభ్యర్థులకు మద్దతుపలికారు. ఉపాధ్యాయ నియోజక వర్గ అభ్యర్థులు విసిరిన బిస్కట్లకు, తాయిలాలకు తమ మేధస్సును తాకట్టుపెట్టారు. తాత్కాలికి లాభం కోసం దీర్ఘకాలిక ప్రయోజనాలకు నీళ్ళొదిలేశారు. విలువలు వలువలు విడిచేసి నిస్సిగ్గుగా అమ్ముడుపోయారు. తాము తయారు చేసిన భావి భారత పౌరులకు ఉన్న కనీస విజ్ఞత ఈ గురువులకు లేకపోవడం శోచనీయం..!

**కె. లక్ష్మీనారాయణరెడ్డి,**
**రిటైర్డ్ హెడ్మాస్టర్ - వేదాయపాలెం.**

# వాహనాల వారినే హడలెత్తిస్తున్న రోడ్డు ప్రమాదాలు

రోడ్ల మీద జరుగుతున్న ప్రమాదాలు చూస్తుంటే, బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎప్పుడు ఏ వాహనం వెనుకనుంచి వచ్చి ఢీకొంటుందో తెలియదు. ముఖ్యంగా హైవే రోడ్లపై తరచూ జరుగుతున్న ప్రమాదాలు సాధారణ ప్రజల్నే కాదు, వాహనదారులను సైతం బెంబేలెత్తిస్తున్నాయి. రాత్రిపూట నిద్రమత్తులో డివైడర్లకు ఢీకొనడం, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం, లేదా తీవ్రంగా గాయపడడం తరచూ జరుగుతూనే ఉంది. లారీలు వంటి పెద్దపెద్ద వాహనాలను ఎక్కడైనా నిలిపివుంటే వెనుకనుంచి వేగంగా వచ్చి ఢీకొని ప్రాణాలమీదికి తెచ్చుకోవడం కూడా నిత్యం ఎక్కడో ఒకచోట జరుగుతూనే ఉంది. ఓ చిన్న కునికిపాటు, లేదా అశ్రద్ధ, మితిమీరిన వేగం..ఇలా ఏదో ఒక కారణంతో జరిగే ప్రమాదాలు ఎంత దారుణంగా ఉంటున్నాయి. వేగంగా వెళ్తున్న ముందు వాహనం, గబుక్కున ఏ అవాంతరంతో బ్రేకు వేసినా ప్రమాదాలు, మరణాలు తప్పడం లేదు. అందులోనూ రాత్రివేళ ప్రమాదాలు ఇంకా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటి ఘోరప్రమాదాలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, మళ్లీ మళ్లీ ఆ ప్రమాదాలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తే బావుంటుంది.

**- కెవిఎస్ఆర్ కృష్ణకుమార్, నెల్లూరు.**

# ఉద్యోగాల పేరుతో బురిడీ




మోసాలు అనేక రకాలు. కష్టపడి పనిచేసుకుని బతకడం మాని, మోసాలతోనే పబ్బం గడుపుకునే వారు నేటి కాలంలో బాగా పెరిగిపోయారు. ఈజీ మనీ (సులభంగా డబ్బు సంపాదన) కోసం వెంపర్లాడుతున్నారు. ఎదుటివారిని ఏదోవిధంగా మస్కాకొట్టి డబ్బు గుంజుకుపోవడం అన్నది మోసగాళ్లకు బాగా సులభమైపోయింది. అందులోనూ నమ్మించి మోసం చేయడం ఇంకా సులభంగా మారిపోయింది. ఆ కోవలోవే.. ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలు. అసలే నిరుద్యోగులు..ఏ ఆసరా లేక బతుకుతెరువు కోసం బాధలు పడుతుంటారు. అందులోనూ బాగా చదువుకున్నవారు కూడా ఉద్యోగాలు ఎప్పుడు దొరుకుతాయా అని ఆశగా చూస్తుంటారు. అలాంటివారిలో బాగా అమాయకుల్ని వెదికి పట్టుకుంటారు కొందరు మోసకారులు. నాకు ఫలానా వాళ్లు బాగా తెలుసని, డబ్బు పెట్టాలే గానీ.. ఉద్యోగాలకు కొదవా ఏంటి?..మనకు ఏ ఉద్యోగం కావాలంటే అదిచ్చేస్తారు. ఎంతమందికైనా క్షణాల్లో ఉద్యోగాలొచ్చేస్తాయి అని నిరుద్యోగ యువతీ యువకుల్ని తమ మాయమాటలతో బురిడీ కొట్టించేస్తారు. మొదట్లో కొంతమందికి అడ్వాన్సు లివ్వాలని డబ్బు లాక్కుంటారు. ఆ తర్వాత, ఉద్యోగం వస్తే ఇంతివ్వాలని ముందుగానే ఒప్పందం కుదుర్చుకుంటారు. ఓ లక్ష ఇస్తే..ఆ ఉద్యోగం మనింటిముందుకు వచ్చి వాలుతుందని చెప్తారు. ఉద్యోగం వచ్చిందాకా ఎవరికీ ఆ విషయం చెప్పొద్దు..పోటీ ఎక్కువవుతుందంటారు. ప్రభుత్వ ఉద్యోగం కదా చాలా జాగ్రత్తగా ఉండాలని బుద్ధులు చెప్తారు. ఇప్పటికే చాలామంది తమను ఉద్యోగాలు అడుగుతున్నట్లు, వారితో ఫోన్‌లలో అదేపనిగా మాట్లాడుతున్నట్లు నటిస్తారు. అవన్నీ నిజమే కాబోలనుకుని నిరుద్యోగులు వారి బుట్టలో పడిపోతుంటారు. నెల్లూరుజిల్లాలో కూడా ఇటీవల ఇలాంటి మోసాలు బాగా పెరిగాయి కాబట్టి నిరుద్యోగులూ..తస్మాత్ జాగ్రత్త!..

## మోసపు మాటలతో డబ్బు గుంజేస్తారు:

అధికారులు, నాయకులంతా తమకు తెలుసని మోసపు మాటలు చెప్పి నిరుద్యోగులను మోసకారులు సులభంగా లోబరుచుకుంటారు. ప్రభుత్వ ఉద్యోగాలిచ్చేస్తామని నమ్మించి వారి నుంచి లక్షలకు లక్షలు కొట్టేస్తుంటారు. తీరా తాము మోసపోయామని తెలుసుకునేటప్పటికే నిరుద్యోగుల జేబులు ఖాళీ అయిపోయి

## సమస్యల తో 'రణం'

ఉంటాయి. కొన్ని రకాల సంస్థలు, మరికొన్ని జాబ్ కన్సల్టీలు కూడా నిరుద్యోగులను మోసం చేస్తున్నట్లు పత్రికల్లో తరచూ మనం చూస్తూనే ఉంటాం. కొందరు ఫోటో నాయకులు రాజకీయనాయకుల వద్ద తిష్ట వేసుక్కూర్చుని నడిపేదంతా తామేనంటూ చక్రం తిప్పుతుంటారు. కొంతమంది అధికారుల వద్ద కూడా చేరిపోయి, వాళ్ళకేది కావాలో అది క్షణాల్లో తెచ్చిస్తూ వారిని మంచి చేసుకుని వారితో తిరుగుతుంటారు. వాళ్ళని చూసి నిరుద్యోగులు వీళ్ళు కూడా పెద్ద పలుకుబడి ఉన్నవాళ్లనుకుంటారు. వాళ్ళతో ఫోటోలు దిగుతారు. ఫోన్లలో తరచూ మాట్లాడుతుంటారు. అవన్నీ చూసి, విన్నవాళ్ళు..వీళ్ళకి ఎంత డబ్బులిచ్చినా భయం లేదని, ఉద్యోగం తప్పకుండా వస్తుందని అనుకుంటారు. వీలు చిక్కితే తమను నమ్మిన అధికారులను, నాయకులను కూడా వాళ్లు మోసం చేసేస్తుంటారు. అట్లని అందరూ ఇలాంటి మోసకారులేనని చెప్పలేం కానీ, కొంతమంది ఘరానా మోసకారులు పొద్దున్న నిద్రమంచం లేచిందగ్గర నుంచి తమ జల్సాలకు డబ్బులెవరిస్తారా?..ఎవరు దొరుకుతారా?..అని కాచుకుని ఉంటారు. అలాంటి వాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండకపోతే మనం మోసపోయినట్లే. తీరా, మనం ఏ లక్షో, రెండు లక్షలో ఇచ్చి ప్రభుత్వ ఉద్యోగం వస్తుంది కదా అని ఆశపడి పడీ.. చివరికి ఎలాంటి ఉద్యోగం రాక నిరాశకు గురైనప్పుడు కానీ, మనం మోసపోయామన్న విషయం గుర్తించలేం. ఆ విషయాన్ని బయటకు చెప్పుకుంటే ఇంకా ఎలాంటి చిక్కుల్లొస్తాయో ఏమోనని భయపడిపోతుంటారు. సరిగ్గా ఈ బలహీనతలే వాళ్ళకి బలం. అమాయకులు అన్నిటికీ భయపడుతుంటారు కనుక ఈ మోసాలు ఇలా జరిగిపోతూనే ఉన్నాయి. డబ్బులేమీ తేరక రావు. కష్టపడందే రూపాయి రాదు. కానీ, మోసకారులు మాత్రం అమాయకుల్ని మోసం చేసి మీసాలు మెలేస్తూ లక్షలకు లక్షలు సంపాదించి జల్సాలు చేస్తుంటారు. ఇకనైనా, ఇలాంటి మోసాల పట్ల నిరుద్యోగులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలి. డబ్బులిస్తే ప్రభుత్వ ఉద్యోగం చిటికెలో ఇప్పించేస్తామని ఎవరైనా చెప్తే.. నమ్మేస్తే ఎలా?..అసలు ఉద్యోగాలు ఆ మోసకారుల చేతుల్లో ఎందుకుంటాయి ఇవ్వడానికి?... చదువుకుని ఉండి కూడా ఎవరో చెప్పే మాయమాటలకు మోసపోతే ఎలా?..అలాంటి మాయమాటలు చెప్పే వారిని గమనించుకోవాలి. అంతా పోయాక, లబోదిబోమనడం వల్ల ప్రయోజనం ఏంటి? ముందుగానే మోసపోకుండా చూసుకోవాలి. మంచి చెడు గమనించుకుంటూ ఉండాలి. డబ్బులిస్తే ఉద్యోగం ఇస్తామని చెప్పేవారు చెప్పేవన్నీ మోసపు మాటలే అయి ఉంటాయి. వారు మనతో అభిమానంగా మాట్లాడుతున్నట్లుగా ఉంటూనే, నమ్మించి మోసం చేస్తారు. ఉద్యోగం రాకుండానే మనవద్ద నుంచి వాళ్ళకివ్వాలి.. వీళ్ళకివ్వాలి.. అంటూ పెద్దమొత్తంలో డబ్బు గుంజేసేవారుంటారు. అదేవిధంగా, ఉద్యోగం ఇవ్వక ముందు కొంత, ఆ తర్వాత ఉద్యోగం వచ్చినతర్వాత ఇంకొంత డబ్బు లంచంగా తీసుకునేవారు కూడా ఉంటారు. ఇలా లోపాయికారి వ్యవహారాలతో, లంచాలతో, మోసాలతో అమాయకప్రజల్ని, నిరుద్యోగుల్ని అనునిత్యం బురిడీ కొట్టించి కుచ్చుటోపీ పెట్టేవారి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. అలాంటి మోసాలపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. లేకుంటే, మళ్లీ వాళ్ళు మరొకళ్ళని దగా చేస్తారు. ఈజీగా మనీ వచ్చేసింది కదా..అని!...

**- సంచారి**

# ప్రగల్భాలకు పట్టభద్రుల గుణపాఠం

## మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి




ముఖ్యమంత్రి జగన్ పలుకుతున్న ప్రగల్భాలకు పట్టభద్రులు తగు గుణపాఠం చెప్పారని, దుర్మార్గపు పాలన చేస్తున్న వైఎస్ఆర్ కాంగ్రెస్‌ను పక్కకు నెట్టి, తెలుగుదేశం పార్టీ పట్ల ఆదరం చూపారని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 19న నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'వై నాట్..175' అంటూ, 175కి 175 సీట్లతో శాసనసభ ఎన్నికల్లో గెలుపు తథ్యం అంటూ బీరాలు పలికిన సిఎంకి, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనే చుక్కెదురైందన్నారు. మొన్న జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపికి పిడిఎఫ్, ఏపీటీఎఫ్, బిజేపీ మద్దతుదారులు తెలుగుదేశం అభ్యర్థులకు ఓట్లు వేసి ఆశీర్వదించారన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు పెడుతున్న వైకాపాను ఓడించి టీడీపి విజయానికి సహకరించిన వారందరికి, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, జలదంకి సుధాకర్, రాజానాయుడు, పెంచలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సజ్జల క్షమాపణలు చెప్పాలి

## తెలుగుయువత నాయకుని డిమాండ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల తీర్పును అవమానిస్తూ రాష్ట్రప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని, క్షమాపణలు చెప్పాలని జిల్లా తెలుగుయువత అధ్యక్షుడు కాకర్ల తిరుమలనాయుడు డిమాండ్ చేశారు. నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో ఈనెల 19న విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు 108 నియోజకవర్గాల్లో ప్రజల నాడిని స్పష్టం చేశాయని చెప్పారు. తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వడ్డమూడి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్‌గౌడ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల ఔదార్యం




నెల్లూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి 5లక్షల రూపాయలు విరాళం ప్రకటించి అందరి అభినందనలు అందుకున్నారు. ఈనెల 19న నెల్లూరు వెంకటేశ్వరపురంలో ఉన్న ఆ కళాశాలలో 1964-2005 మధ్య వివిధ కోర్సులు చదువుకున్నవారంతా సమావేశమయ్యారు. దేశవ్యాప్తంగా వారంతా ఇప్పుడు వివిధ రంగాల్లో ఉన్నతస్థాయిలో స్థిరపడ్డారు. తమ అభివృద్ధికి కారణమైన కళాశాలకు తొలివిడతగా లక్ష రూపాయలు విరాళమిస్తామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రావుతో పాటు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో ఉచిత దంత పరీక్షా శిబిరం



శ్రీసిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దంత సమస్యలపై ఇటీవల అవగాహన కల్పించారు. వారికి ఉచిత చికిత్స అందించడం కోసం వారం రోజుల పాటు దంత పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నారు. శ్రీసిటీలోని కేర్ ఇంటర్నేషనల్ డెంటల్ సెంటర్ మరియు కోల్గేట్ పామోలివ్ పరిశ్రమ సహకారంతో శ్రీసిటీ ఫౌండేషన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. మొదటి రోజు శ్రీహరికోట కాలనీ, తొండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు 45 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి నోటి పరిశుభ్రతపై సూచనలు అందించారు. పారామెడికల్ సిబ్బంది సహాయంతో డాక్టర్ మెటిల్డా విద్యార్థులకు సమగ్ర దంతపరీక్షలు నిర్వహించారు. దంత క్షయానికి దారితీసే వివిధ కారణాలు, ఆహారపు అలవాట్లను విద్యార్థులకు వివరించారు. కోల్గేట్ పామోలివ్ పరిశ్రమ ద్వారా విద్యార్థులందరికీ డెంటల్ కేర్ కిట్లను సరఫరా చేశారు. వారంరోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో శ్రీసిటీ పరిధిలోని 14 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన మొత్తం 250 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేయాలన్నది లక్ష్యంగా నిర్వాహకులు తెలిపారు. కేర్ ఇంటర్నేషనల్ డెంటల్ సెంటర్ వైద్యులు స్వరూప్‌కుమార్ రెడ్డి, శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో దంత చికిత్సలు చేస్తున్నారు.

# విద్య-వైద్యరంగాలకు సీఎం జగన్ ప్రాధాన్యం

## - నెల్లూరు ఎంపీ ఆదాల ప్రశంస



ప్రాధాన్యతారంగాలైన విద్యకు, వైద్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎంతో ప్రాధాన్యత ఇచ్చి, ఆ రంగాల అభివృద్ధికి కృషిచేస్తున్నారని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ముగ్గురు బాధితులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన 8.20 లక్షల రూపాయల చెక్కులను బాధితులు ముగ్గురికి ఇటీవల ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆదాల మాట్లాడుతూ 'నాడు- నేడు' పథకం కింద స్కూళ్లను కార్పొరేట్ స్థాయికి మించి అభివృద్ధి చేశారని మెచ్చుకున్నారు. విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లలో చదవడానికి బాగా ఇష్టపడుతున్నారని పేర్కొన్నారు. పేదవాళ్లకు వైద్యపరంగా సీఎం సహాయ నిధి ద్వారా ముఖ్యమంత్రి ఆదుకుంటున్నారంటూ ముఖ్యమంత్రికి తన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు అవినాష్, నాగరాజు, వైసీపీ నేతలు నవీన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సునీల్, జీవి ప్రసాద్ ఆర్ఎస్ఆర్, వెంకటేష్, సుబ్బారెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడ కామాక్షమ్మకు..

# బంగారు లాకెట్



జొన్నవాడ కామాక్షి తాయి అమ్మవారికి కావలికి చెందిన దాతలు సూరిబోయిన శ్రీధర్‌రెడ్డి-మమత దంపతులు ఈనెల 19న 9 గ్రాముల బంగారు లాకెట్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దాతలను స్వామివార్ల శేష వస్త్రాలతో సన్మానించారు.

# ఆమంచర్లవాసులకు అండగా ఉంటాం :

ఆమంచర్ల ప్రాంతవాసులకు అన్ని విషయాల్లో అండగా ఉంటామని నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆమంచర్ల నుంచి ఎంపీ ఆదాలకు సంఘీభావం తెలిపేందుకు ఇటీవల ఆ ప్రాంతవాసులు అధిక సంఖ్యలో నెల్లూరుకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొదటి నుంచి ఆమంచర్ల ప్రాంతవాసులతో తనకు మంచి సంబంధాలు ఉన్నాయని, వారు తనకు సంఘీభావం తెలుపడానికి వచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు. డిసిసిబి మాజీ ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి, రానున్న కాలంలో వారి అభివృద్ధికి తోడ్పడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి వెంకటేశ్వర్లునాయుడు, మాజీ సర్పంచ్ రత్నయ్య తదితరులు ఎంపీ ఆదాలను గజమాలతో ఘనంగా సత్కరించారు.

# 24న.. మత్స్యజయంతి

నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీకృష్ణ యోగ మందిరం (అష్టలక్ష్మీ మందిరం)లో మార్చి 24న మత్స్యజయంతి సందర్భంగా శ్రీ కృష్ణునికి మత్స్యాలంకారాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తామని శ్రీ గణపతి సచ్చిదానందస్వామీజీ వారి అవధూత దత్తపీఠం-నెల్లూరు శాఖ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గంటలకు మత్స్య గాయత్రి మంత్ర సహిత హోమం జరుగుతుందని, భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని ఆయన కోరారు.

# పసుపు రైతులను ఆదుకోవాలి



జిల్లాలో రైతులు పండించిన పసుపు పంటను ప్రభుత్వం మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలంటూ ఈనెల 19న ఉదయగిరి మండలం కృష్ణారెడ్డిపల్లిలో రైతులు ఆందోళన చేశారు. రైతు సంఘం నాయకుడు వెంకటయ్య మాట్లాడుతూ, పసుపు ధర ఆశాజనకంగా లేదని, దీంతో రైతులు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

## అకాలవర్షాలతో..

# మళ్లీ పంటలకు నష్టాలు

## ○ వేలాది ఎకరాలు నీట మునక



సముద్రంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఇటీవల జిల్లాలోని అనేక మండలాల్లో మూడురోజుల పాటు జోరుగా వానలు కురిశాయి. పలు మండలాల్లో వాన విధ్వంసం సృష్టించింది. అనేకచోట్ల వడగళ్ళు, పిడుగులు పడ్డాయి. చెట్లు నేలకూలాయి. జలదంకి మండలం లోని అన్నవరంలో రామాలయం ధ్వజ స్తంభం పడిపోయింది. ఈ అకాల వర్షాలతో ఉదయగిరి, కలిగిరి, చేజర్ల, కొండాపురం, కావలి, జలదంకి, బోగోలు, రాపూరు, కోవూరు, ఆత్మకూరు, కొడవలూరు, పొదలకూరు, బుచ్చి, విడవలూరు, అల్లూరు తదితర ప్రాంతాల్లో పంట పొలాలు బాగా దెబ్బతిన్నాయి. ఏఎస్‌పేట, జలదంకి మండలాల్లో కొన్నిచోట్ల వడగళ్ళు కూడా పడడంతో పంటలు నాశనమయ్యాయి. ప్రాథమిక అంచనాల ప్రకారం 129 గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా వరికోతలు జరిగి ధాన్యం రేపోమాపో విక్రయించుకోవాలనుకుంటున్న వేలాదిమంది రైతుల ఆశలు ఈ అకాలవర్షం వల్ల నిరాశలుగానే మిగిలాయి. తడిసిన ధాన్యాన్ని ఎలా అమ్ముకోవాలో తెలియక, మద్దతు ధర వస్తుందో రాదోనని రైతులు విలవిలలాడుతున్నారు. ఒక్క వరి రైతులకే కాక, ఇతర పంటల రైతులు, కూరగాయల రైతులకు కూడా ఈ వర్షం వల్ల నష్టాలే మిగిలాయి. తమ రెక్కల కష్టమంతా వృధా అయిపోయిందంటూ పేదరైతులు గోడుగోడుమంటున్నారు. తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే ఈ కష్టాల నుంచి గట్టెక్కించాలంటూ వారు మొరపెట్టుకుంటున్నారు.

# నెల్లూరు కబుర్లు

## అటవీ భూములను సంరక్షించాలి

### అధికారులకు కలెక్టర్ ఆదేశం

అటవీ భూముల పరిరక్షణకు, వన్య ప్రాణుల సంరక్షణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు, అధికారులను ఆదేశించారు. ఈనెల 20న నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి అటవీ, వన్యప్రాణి సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ విజయారావు, జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌లతో కలిసి జిల్లాలో అటవీ భూముల పరిరక్షణకు, వన్య ప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించారు. అటవీ ప్రాంతాల మీదుగా వెళ్ళే జాతీయ రహదారులు, ఆర్అండ్‌బి, పంచాయతీ రహదారులపై వెళ్ళే వాహనాల వల్ల వన్యప్రాణులు ప్రమాదాలకు గురై మృతి చెందడం జరుగుతోందని, గుర్తించిన అటవీ ప్రాంతాల్లో ఆయా రోడ్లపై స్పీడ్ బ్రేకర్లను, సోలార్ లైటింగ్ లను, సైన్‌బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వేసవి కాలం దృష్ట్యా అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణులకు త్రాగునీటి సదుపాయాలు ఉండేలా అవసరమైన ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ద్వామా అధికారులను ఆదేశించారు.

## 26న.. రెడ్‌క్రాస్ ఎన్నికలకు నామినేషన్లు

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నెల్లూరు జిల్లా శాఖ ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమైంది. ఈనెల 26న నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో సమావేశం నిర్వహించి, రెడ్‌క్రాస్ కమిటీకి 15 మంది సభ్యులను ఎన్నుకునేందుకు నామినేషన్లు స్వీకరిస్తామని, ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఆదేశాలు జారీచేశారని జిల్లా సహకార శాఖ అధికారి తిరుపాల్‌రెడ్డి ఇటీవల ఒక ప్రకటనలో తెలిపారు. ఒకవేళ పోటీ ఉంటే ఏప్రిల్ 2న ఎన్నికలు నిర్వహిస్తామని, ఓట్ల లెక్కింపు 3న జరుగుతుందని, ఎన్నికైన సభ్యులు 4వ తేదీన ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్, ట్రెజరర్‌లను ఎన్నుకుంటారని ఆయన పేర్కొన్నారు.

## పెద్దాసుపత్రికి కొత్త అధికారి



నెల్లూరు పెద్దాసుపత్రికి (ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి) అసిస్టెంట్ డైరెక్టర్‌గా విజయవాడ డైరెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తున్న ఏడుకొండలను పదోన్నతిపై నియమించారు. ఇటీవల ఆయన ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు.

## డా.అంబేద్కర్ కలలను సాకారం చేయాలి



భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కలలను సాకారం చేయాలని, బడుగు బలహీనవర్గాల రాజ్యాస్థాపన కోసం దళిత, గిరిజన సంఘాల నాయకులు కృషిచేయాలని జై భీమ్ దేశ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెన్నకేశవులు పిలుపునిచ్చారు. నెల్లూరు దర్గామిట్టలోని అంబేద్కర్‌భవన్‌లో ఇటీవల జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీఎస్టీబీసీ మైనార్టీ కులాలకు ప్రభుత్వం ఒరగబెట్టిందేమీ లేదని విమర్శించారు. ఆ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి కృష్ణ, పలు సంఘాల నాయకులు చారువాక, పకీరప్ప, జాన్‌బాబు, వెంకటరమణ, మహబూబ్, మహిళా నేతలు సుభాషిణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా శ్రీవారి కల్యాణోత్సవం

నెల్లూరు బాలాజీనగర్‌లో ఇటీవల శ్రీవారి కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. శ్రీ వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీ సీతారామస్వామి మందిరంలో వికాస్ సేవా సమితి వ్యవస్థాపకులు, కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం తిరుమలేశుని పెళ్ళివేడుకను అత్యంత వైభవంగా నిర్వహించారు. సీతారామస్వామి మందిరం నుంచి శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను వేదిక వద్దకు తీసుకువచ్చి, ప్రత్యేక పూజల అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టీటీడి ఉత్తరభారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి (న్యూఢిల్లీ) ఛైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తదితర ప్రముఖులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేదపండితుడు నారాయణం దాశరథి ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది.

## ఎంవిఐపై దాడి అమానుషం



విధి నిర్వహణలో ఉన్న కాకినాడ రవాణాశాఖ బ్రేక్ ఇన్స్‌పెక్టర్ (ఎంవిఐ) చిన్నారావుపై ఓ వ్యక్తి కత్తితో అమానుషంగా దాడిచేయడం దారుణమని నెల్లూరులోని ఆ శాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి దాడులు ఇకపై జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆలిండియా మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్స్ ఫెడరేషన్ కోరిందని ఆయన చెప్పారు. ఫెడరేషన్ ఇటీవల నిర్వహించిన జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏపీలోని పలు జిల్లాల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. నెల్లూరు ఉప రవాణా కమిషనర్ చందర్ ఆదేశాలతో ఇక్కడి సిబ్బంది కూడా పాల్గొని చిన్నారావు కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సర్వమత ప్రార్థనలు చేశారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి విశ్వరూప్, ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న, కేరళ ఆలిండియా ఎంవిఐల అసోసియేషన్ నాయకుడు అష్పక్ అహ్మద్, మహారాష్ట్ర నుంచి వాసుదేవ భగత్, తమిళనాడు నుండి సంఘం కోశాధికారి సంపత్, నెల్లూరు నుండి ఎంవిఐలు బాలమురళీకృష్ణ, షేక్ బాబు, కార్తీక్ పవన్, ఏఎంవిఐలు పూర్ణచంద్రరావు, స్వప్నిల్‌రెడ్డి, రఘురామరెడ్డి, కిషోర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## హెడ్‌కానిస్టేబుల్‌కు..ఎస్పీ నివాళి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజుకు జిల్లా ఎస్పీ సిహెచ్ విజయారావు నివాళులర్పించారు. 1998 బ్యాచ్‌కి చెందిన చంద్రశేఖర్‌రాజు సోమశిల పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. విధులు నిర్వహించి తమ ఇంటికి మోటార్ బైక్‌పై వస్తూ మార్గ మధ్యంలో రోడ్డుప్రమాదంలో ఆయన మరణించారు. ఈనెల 19న జిల్లా ఎస్పీ ఆయన ఇంటికివెళ్ళి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల కోసం రూ. 50 వేలను వారి కుటుంబసభ్యులకు అందజేశారు. వారి కుటుంబానికి పోలీసుశాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ప్రకాశంజిల్లా ఇన్‌చార్జి డిటిసిగా.. చందర్



నెల్లూరు ఉప రవాణా కమిషనర్ (డిటిసి) చందర్‌ను ప్రకాశంజిల్లా ఇన్‌చార్జి డిటిసిగా నియమించారు. రాష్ట్ర రవాణాశాఖ కార్యాలయం నుంచి ఆమేరకు ఇటీవల ఉత్తర్వులు వచ్చాయి. అక్కడ పనిచేస్తున్న డిటిసి కృష్ణవేణికి జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతి లభించడంతో, ఆ స్థానంలో ఇన్‌చార్జిగా చందర్ నియమితులై అదనపు బాధ్యతలు స్వీకరించారు.

### డాక్టర్ కిషోర్స్ రత్నంలో..

## ఉగాది వేడుకలు



నెల్లూరులోని డాక్టర్ కిషోర్స్ రత్నం సరస్వతినగర్ కిడ్స్, రేస్ ఇంటర్నేషనల్, టెక్నో మెడికల్ ఒలంపియాడ్ విద్యార్థులు ఈనెల 21న శోభకృత్ నామసంవత్సర ఉగాది ముందస్తు వేడుకలు ఎంతో కోలాహలంగా జరుపుకున్నారు. విద్యార్థులు తెలుగుతనానికి ప్రతీకగా సంప్రదాయ దుస్తులు ధరించి వేదపఠనం, కలశపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. సంప్రదాయబద్ధంగా ఉగాదిని స్వాగతిస్తూ గోమాతను పూజించారు. తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా చక్కటి నృత్యప్రదర్శనలు, పద్యాలు, పాటలు, నాటికలతో అందరినీ అలరించారు. ప్రపంచ తెలుగుసమాఖ్య ప్రాంతీయ అధ్యక్షులు నలుబోలు బలరామయ్యనాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ఉగాది విశిష్టతను వివరించారు. డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా. కృష్ణకిషోర్, వాసంతి కిషోర్, జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు విద్యార్థులకు, తల్లితండ్రులకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. జూనియర్ మేనేజర్ అజయ్, ఏఓ సునీల్, ప్రిన్సిపాల్స్ మణిమాల, ప్రపూర్ణ, జాస్మిన్, నాగేంద్ర, ప్రిసిల్ల తదితరులు పాల్గొన్నారు.

### 30 నుంచి సాయిదర్బార్‌లో..

## శ్రీరామనవమి వేడుకలు

నెల్లూరు బాలాజీనగర్ శివారుల్లో ఉన్న సాయిదర్బార్ అద్దాల మందిరంలో మార్చి 30,31 తేదీల్లో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని మందిరం ట్రస్టీ మధుసాయి తెలిపారు. 30వ తేదీ ఉదయం సాయినాథునికి పూజలు, ఆ తర్వాత శ్రీ సాయి సేవాలయంలో కొలువైవున్న శ్రీ సీతారామచంద్రులకు కల్యాణోత్సవం, అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఉంటాయన్నారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణంతో పాటు షిర్డీ సంప్రదాయానుసారం సాయినాథుని దివ్య రథోత్సవం, వెండిపల్లకీ ఉత్సవం, ఫకీరులతో గంధమహోత్సవం, సాయినాథుని నగరోత్సవం నేత్రపర్వంగా నిర్వహిస్తామన్నారు. 31వ తేదీ ఉదయం నుంచి శ్రీ సాయి సచ్చరిత్ర అఖండపారాయణం జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఈ వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనాలి



జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, మద్దతు ధర ఇచ్చి అన్నదాతలను ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుకు బిజెపి నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఈనెల 20న జిల్లా కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ వర్షాలకు ఉద్యాన పంటలు, కూరగాయల రైతులు కూడా నష్టపోవడం జరిగిందని, మెట్ట పంటలు బాగా దెబ్బతిన్నాయని, రైతులకు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, గత రెండు సీజన్లలో జిల్లాలోని అనేకమంది రైతులకు చెల్లించాల్సిన రవాణా చార్జీలు, హమాలీ చార్జీలను చెల్లించే ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సునీల్‌రెడ్డి, కంచర్ల నారాయణ యాదవ్, ముప్పల రాంబాబు, నరసయ్య సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## డాక్టరేట్ ప్రదానం




బయోటెక్నాలజీలో జీవ ఇంధనాలపై పరిశోధన చేసిన నెల్లూరు డైకస్ రోడ్డుకు చెందిన శ్రీనివాసకుమార్‌కు డాక్టరేట్ లభించింది. ఈనెల 19న జేఎన్టీయు హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ తమిళిసై చేతులమీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు.

## బీసీ విద్యార్థులకు మ్యాచింగ్ గ్రాంట్ కోసం..
# కేంద్రమంత్రితో బిఎంఆర్, కృష్ణయ్య చర్చలు




ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్ షిప్, హాస్టళ్ళ నిర్వహణ, గురుకుల పాఠశాలల నిర్వహణ, బీసీ కార్పొరేషన్ రుణాలు లాంటి పలు పథకాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం గ్రాంటును మ్యాచింగ్ గ్రాంట్‌గా ఇవ్వాలని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బిఎంఆర్), ఆర్ కృష్ణయ్య ఇటీవల కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి వీరేంద్రకుమార్‌ను కలిసి చర్చలు జరిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక అభివృద్ధికి ఎలాంటి పథకాలు అమలు చేయడం లేదని, పైగా రాష్ట్రాలు అమలు చేస్తున్న స్కీమ్‌లకు గ్రాంటు ఇవ్వడం లేదని, అందుకే రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం, స్కాలర్‌షిప్ పథకాలకు, హాస్టళ్ళు, గురుకుల పాఠశాల నిర్వహణ పథకాలకు 60 శాతం గ్రాంటు ఇవ్వాలని కోరారు. అదేవిధంగా, జాతీయ బీసీ కార్పొరేషన్, రెండు రాష్ట్రాలు నిర్వహిస్తున్న బీసీ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. అందుకు కేంద్ర మంత్రి స్పందిస్తూ హాస్టళ్ళకు, గురుకుల పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం స్థలాలు కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే వెంటనే కేంద్ర ప్రభుత్వం బాలుర కాలేజీ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలకు 60 శాతం, బాలికల కాలేజీ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు 80 శాతం గ్రాంటు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెంగళరావు, బీసీ నాయకులు గుజ్జు కృష్ణ, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామ్ చేతులమీదుగా.. రాగిజావ



రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు పోషకాహారం కోసం అందిస్తున్న 'జగనన్న గోరుముద్ద'లో భాగంగా ఈనెల 21న రాగిజావ పంపిణీ ప్రారంభాన్ని పురస్కరించుకుని, వెంకటగిరిలోని ఏపీ మోడల్ హైస్కూల్ విద్యార్థులకు గ్లాసులు పంపిణీ చేసి, రాగిజావ పంపిణీ చేస్తున్న రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ డెవలప్‌మెంట్ బోర్డ్ చైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి.

## చనిపోయిన వలంటీర్ కుటుంబానికి
# 5 లక్షల ఆర్థికసాయం



ఇటీవల చనిపోయిన ఒక వలంటీర్ కుటుంబానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 5లక్షల రూపాయల ఆర్థికసాయాన్ని అందజేసి బాధితురాలి కుటుంబానికి అండగా నిలిచారు. కోవూరు మండలం పడుగుపాడులోని చంద్రమౌళినగర్ వలంటీర్ కొమరగిరి అఖిల మూడునెలల క్రితం బిడ్డని ప్రసవించి, ఆస్పత్రిలో ఫిట్స్‌కిగురై మృతి చెందడంతో ఆ విషయాన్ని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. అందుకు స్పందించిన ముఖ్యమంత్రి ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 5 లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఆ చెక్కును నెల్లూరులోని తన నివాసంలో చనిపోయిన అఖిల కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే ప్రసన్న అందజేశారు. రాష్ట్ర వ్యవసాయ సలహామండలి సభ్యులు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు మండల వైకాపా అధ్యక్షులు నలుబోలు సుబ్బారెడ్డి, పడుగుపాడు సొసైటీ ఛైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి,పడుగుపాడు ఉప సర్పంచ్ షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# నేత్రపర్వంగా.. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం

## వేలాదిగా తరలివచ్చిన భక్తజనం



తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం సందర్భంగా సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి నగరోత్సవం కనుల పండువగా సాగింది. ఉగాది మహోత్సవం సందర్భంగా అమ్మవారి నగరోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మంగళవాద్యాలు, బ్యాండ్ మేళాలు, తప్పెట్లు, బాణసంచా వేడుకలతో నగరోత్సం కనువిందుగా జరిగింది. నెల్లూరు ఎంపీ, నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అమ్మవారి నగరోత్సవ ఏర్పాట్లను విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. అమ్మవారి నగరోత్సవానికి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయప్రాంగణం క్రిక్కిరిసిపోయింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు దగ్గరుండి ఏర్పాట్లను నిర్వహించారు. రెండేళ్ల క్రితం కరోనా వచ్చిన నేపథ్యంలో ఆ తర్వాత తొలిసారిగా ఉగాది మహోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మాజీ డిసిసిబి ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, దేవస్థానం పాలకమండలి కమిటీ చైర్మన్ రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్) కార్పొరేటర్లు కె.విజయ లక్ష్మి, యాకసిరి శరచ్చంద్ర, వివిధ శాఖల అధికారులు, దేవస్థానం పాలక మండలి సభ్యులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# శ్రీసిటీలో ఉగాది వేడుకలు



శ్రీ శోభకృత్ నామ సంవత్సర తెలుగు ఉగాదిని పురస్కరించుకుని శ్రీసిటీలో ఈనెల 22న ఉగాది వేడుకలు నిర్వహించారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో స్థానిక బిజినెస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు ఉగాది పురస్కారాలను అందచేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి చేతుల మీదుగా 'శ్రీవాణి' ప్రతిష్టాత్మక ఉగాది భాషా పురస్కారాన్ని డాక్టర్ కాసల నాగభూషణం, కవితా పురస్కారాన్ని వక్కలంక సీతారామారావు (వశీర), ఉగాది కథా పురస్కారాన్ని కుప్పిలి పద్మ, ఉగాది ఆధ్యాత్మిక పురస్కారాన్ని ఒంటి రవి, ఉగాది గాయక పురస్కారాన్ని రాము మహరాజపురం అందుకున్నారు. పురస్కార గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపిన రవీంద్ర సన్నారెడ్డి, ఉగాది పర్వదినాన వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఉగాది పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ శ్రీసిటీ ప్రగతిని, పచ్చదనాన్ని, రవీంద్ర సన్నారెడ్డి గొప్పదనాన్ని కవితలు, పాటలు, పద్యాల రూపంలో వర్ణించారు. సూళ్ళూరుపేటకు చెందిన ఎంజీఆర్ మ్యూజిక్ అకాడమీ బృందం చేసిన వీణా వాదన సభికులను ఎంతగానో అలరించింది. ముఖ్యఅతిథులుగా రాజగోపాలరెడ్డి, శోభారాజా, డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, సంవే రమేష్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

# 'తంగిరాల మహాభారతం' 47వ భాగం




పాండవులు, వుత్కోచ ఆశ్రమానికి వెళ్లి గొప్ప తపస్సంపన్నుడయిన ధౌమ్య మునీశ్వరుణ్ణి కలిసి, తమకు పురోహితుడిగా ఉండమని కోరినప్పుడు, ఆయన ఎంతో గౌరవమని భావించి అంగీకరిస్తాడు. ధౌమ్యుడు పాండవులని తీసుకుని ప్రయాణమై పాంచాల రాజధాని, కాంపిల్య నగరానికి చేరుకుంటారు. వారితోపాటు గుంపులు గుంపులుగా బ్రాహ్మణులు కూడా చేరుకుంటారు. నగరమంతా ద్రౌపది స్వయంవరంతో కోలాహలంగ ఉంటుంది. పాండవులు ఎవరికీ తెలియకుండా ఒక కుమ్మరి ఇంట్లో బసచేస్తారు.

ద్రౌపది స్వయంవరానికి ఒక రంగస్థలం ఏర్పాటు చేస్తారు. నలుమూలల నుంచి వచ్చిన రాజులను ద్రుపద మహారాజు ఆహ్వానించి తగు రీతిలో గౌరవమిస్తాడు. వారిలో కౌరవ కుమారులు, కర్ణ, శల్య, శకుని, జరాసంధ, శిశుపాల మొదలగు వీరులు ఉంటారు. కృష్ణుడు, బలరాము నితో ఈ స్వయంవరం తిలకించటానికి వస్తాడు. వేలకొలది బ్రాహ్మణులు తమ తమ స్థానాల్లో ఆసీనులవుతారు. పాండవులు మెల్లగా వచ్చి బ్రాహ్మణుల మధ్యలో కూర్చుంటారు. ద్రుపద మహారాజు లాంఛనంగా స్వయంవరం మొదలుపెడతాడు. ద్రౌపది తెల్లని పూలహారంతో సభాస్థలి మధ్యకి వస్తుంది. ఆమె అందాన్ని చూసి అందరు పరవశులైపోతారు. దృష్టద్యుమ్నుడు మత్స్య యంత్రాన్ని, ధనుస్సుని చూపించి... దాన్ని ఛేదించిన వీరునికి తన చెల్లెలితో వివాహమవుతుందని ప్రకటిస్తాడు. శ్రీకృష్ణుడు పాండవులని గుర్తుపట్టి, అర్జునుడే, ద్రౌపదిని చేపడతాడని భావిస్తాడు. స్వయంవరం మొదలవుతుంది.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం
Syam Tangirala Mahabharatam
@YouTubeలో చూడగలరు.



# ఎన్‌బికెఆర్‌లో పరిగ్రాహ్-2023




ఎన్‌బికెఆర్‌లోని సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఇటీవల 'పరిగ్రాహ్-2023' జాతీయస్థాయి శాస్త్ర సాంకేతిక సదస్సును నిర్వహించారు. విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించేందుకు నిర్వహించిన ఈ సదస్సులో దేశంలోని అనేక ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 50 మంది విద్యార్థులు వివిధ అంశాలపై పత్ర సమర్పణ చేశారు. వాటిలో ఉత్తమంగా ఉన్న 10 పత్రాలను ఎంపిక చేసి ఆ విద్యార్థులకు పోటీ నిర్వహించారు. విద్యార్థులకు పోస్టర్స్ ప్రెజెంటేషన్, వ్యాసరచన పోటీలు పెట్టారు. గెలుపొందిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ డా. వి.విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగించి రోడ్ల నిర్మాణం చేయడంపై, పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్మాణరంగంలో కీలకపాత్ర పోషించే అడ్వాన్స్ సర్వేయింగ్ టెక్నిక్స్ అనే అంశాలపై వర్క్‌షాప్‌లు ఏర్పాటుచేసి, విద్యార్థులకు ఆయా అంశాలపై అవగాహన కలిగించారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డా.డి.శ్రీనివాస్, కన్వీనర్ తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 25న.. జాతీయస్థాయి సాంకేతిక సదస్సు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మార్చి 25న జాతీయస్థాయిలో 'టెక్నికల్ ఫెస్ట్-మెక్సోడియా 2023'ను నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డా. వి. విజయ కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పేపర్, పోస్టర్ ప్రెజెంటేషన్స్, మోడల్స్ ప్రదర్శన తదితర విభాగాల్లో పోటీలు పెట్టి, విజేతలైన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు నగదు బహుమతులు కూడా అందజేస్తామన్నారు. కిసాన్ డ్రోన్, ఎస్ఏఇ క్లబ్ విద్యార్థులు రూపొందించిన వివిధ వాహనాల నమూనాలను ప్రదర్శిస్తారని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డా.సిహెచ్ ఆర్ విక్రమ్‌కుమార్ రెడ్డి, కన్వీనర్ డా.వై. అశోక్‌కుమార్‌రెడ్డి, డా. బి.అమర్‌బాబు, ప్రొఫెసర్లు డా.ఎం.శ్రీనివాసులు, డా.పి.శ్రీహరిరెడ్డి, డా.పి.నందన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ పూర్తిచేసుకున్న ఎన్‌సిసి క్యాడెట్లు




విద్యానగర్ ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో నావెల్ ఎన్‌సిసి కాడెట్ల మొదటి బృందంలో 15 మంది మూడుసంవత్సరాల పాటు (2020-23) జరిగిన శిక్షణ పూర్తిచేసుకున్నారు. ఇటీవల వారికి వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి సమాజసేవ కోసం వారు పాటుపడాలని కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి, నావెల్ అధికారి డా.వి.మల్లికార్జునరెడ్డి, ఆర్మీ అధికారి జి.మాధవయ్య ఆకాంక్షించారు. ఇప్పటికే పునీత్ సాగర్ అభియాన్, ఎయిడ్స్ ర్యాలీలు, ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమాలు, అజాదీ కా అమృత్, రక్తదాన శిబిరాలు తదితరాల్లో క్యాడెట్లు పాల్గొన్నారని, దేశభక్తితో నిర్వహించే వారి కార్యక్రమాలు అందరి ప్రశంసలందుకుంటున్నాయని, 2021-22 స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ఎన్‌సిసి క్యాడెట్లు ఫణి ఆదిత్య, మౌనికలు రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రిల ఎదుట కవాతులో, ముంబైలో జరిగిన మరో శిబిరంలో ద్వారకనాథ్‌రెడ్డి, వెంకటసాయి పాల్గొన్నారని ఆ క్యాడెట్లను అందరూ అభినందించారు. అనంతరం ఆ బ్యాచ్ క్యాడెట్లకు విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా వీడ్కోలు పలికారు.

## ఇన్‌ఫోరియం-2కె 23 :

ఎన్‌బికెఆర్‌లో ఇటీవల ఇన్‌ఫోరియం-2కె 23 సాంకేతిక సదస్సు జరిగింది. రాష్ట్రంలోని అనేక కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. తొలుత కళాశాల డైరెక్టర్ డా.వి.విజయ కుమార్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ఐటి,ఏఐడిఏస్ డా.అప్పిని నారాయణరావు, సదస్సు కోఆర్డినేటర్ ఎం. శివప్రతాప్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లిథియం ప్రాజెక్టుల వివరాలు తెలపండి

## - పార్లమెంట్‌లో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రీసెర్చ్ ప్రోగ్రాం కింద చేపట్టిన అయిదు లిథియం ప్రాజెక్టుల వివరాలు తెలపాలని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. ఈనెల 20న ఆయన పార్లమెంట్‌లో మాట్లాడుతూ, ఏపీలో కనుగొన్న లిథియం లోహపు వనరుల వివరాలను అడిగారు. అందుకు కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి సమాధానం చెప్తూ, రాష్ట్రంలో లిథియం ప్రాజెక్టుకు 2020-21లో నిఘాసర్వే (జీ24) ప్రారంభ మైందని తెలిపారు.

## అంబులెన్స్‌ల వినియోగంపై విపిఆర్ ప్రశ్నలు

అంబులెన్స్ ప్రవేశించలేని, లేదా చేరుకోలేని కొండ ప్రాంతాలలో ఉపయోగించేందుకు, ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో జెఎన్‌టియు ద్వారా బైక్ అంబులెన్స్‌ను, కేంద్ర మంత్రిత్వశాఖ అభివృద్ధిచేస్తోందా?..అని ఈనెల 21న పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి డాక్టర్ భారతి ప్రవీణ్‌పవార్ సమాధానమిస్తూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి అందిన సమాచారం ప్రకారం, గిరిజన సంక్షేమ శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం-కాకినాడ వారి సమన్వయంతో గిరిజన ప్రాంతాల్లో ఉపయోగించేందుకు బైక్ అంబులెన్స్ ఆలోచనతో ముందుకు వచ్చిందని తెలిపారు. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, రూ.490.5 లక్షలు ఆర్థిక సహాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖకు బైక్ అంబులెన్స్‌ల కోసం అందించిందని వివరించారు.

# సరస్వతీ సమాజంలో ఉగాది సంబరాలు



నెల్లూరు మూలాపేట లోని శ్రీ అన్న దేవుల గోవిం దురెడ్డి సరస్వతీ సమాజం ఆధ్వర్యంలో ఈనెల 22న ఉగాది సంబరాలు కోలాహలంగా జరిగాయి. విఆర్ హైస్కూలు విశ్రాంత తెలుగుపండితులు విద్వాన్ మాచవోలు పట్టాభిరామారావు పంచాంగశ్రవణం నిర్వహించారు. డికెడబ్ల్యు కళాశాల తెలుగుశాఖ అధ్యక్షురాలు డా. వై.దివ్య ఉగాది ప్రాశస్త్యాన్ని వివరించారు. సరస్వతీ సమాజం అధ్యక్ష కార్యదర్శులు మోపూరు పెంచలయ్య, టి. రమణయ్యల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు అందరినీ ఆకట్టుకున్నాయి. ట్రస్టీ శ్రీధర్, కోశాధికారి వెంకటేశ్వర్లు తదితరులు పర్యవేక్షించారు.

# తిరుపతి జిల్లా గూడూరు డివిజన్



## ఎమ్మెల్సీ మేరిగకు ఘన స్వాగతం

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి తొలిసారిగా గూడూరుకు విచ్చేసిన మేరిగ మురళీధర్‌కు వైకాపా స్థానిక నేతలు ఈ నెల 19వతేదీ ఘనస్వాగతం పలికారు. గూడూరు రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీడిపో ప్రాంతంలోని సిఆర్‌రెడ్డి కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి సత్కరించారు. తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీ మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ పొణకా దేవసేనమ్మ, నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కోడూరు మీరారెడ్డి, కోడూరు కల్పలత, మల్లు విజయకుమార్‌రెడ్డి, తాళ్ళూరు శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛత అవార్డులకు దరఖాస్తులు

గూడూరు పురపాలక సంఘం పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతిభ చూపిన మహిళలకు స్వచ్ఛత అవార్డులు ఇవ్వడానికై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గూడూరు పురపాలక సంఘం కమిషనర్ తోట సాయినాథ్ ఒక ప్రకటనలో కోరారు. సామాజిక మరుగుదొడ్ల నిర్వహణ, సెప్టిక్ ట్యాంకుల శుభ్రత, వ్యర్థాల శుద్ధికరణ, చెత్త సేకరణ, చెత్తతో కళాకృతుల తయారీ తదితర విభాగాలలో వీటిని అందజేస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు గూడూరు పురపాలక కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, ఎంపికైన వారికి జూన్5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులనందజేస్తామన్నారు.

## రాజరాజేశ్వరి గుడి వద్ద అన్నదానం



శోభకృత్ నామ ఉగాది పండుగ సందర్భంగా గూడూరు పట్టణంలోని రాజరాజేశ్వరి అమ్మవారి గుడి వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఉభయకర్తలుగా వాటంబేటి శివకుమార్, వాటంబేటి హరికుమార్‌లు పాల్గొన్నారు. నట శేఖర్, చంద్రమౌళి, కోదండయ్య, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సరుకుల పంపిణీ



డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా పథకంలో భాగంగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ఆంధ్రమహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ చెరుకూరి రోహిణి, డాక్టర్ జనార్ధన్‌రెడ్డిల చేతుల మీదుగా పేదలకు, వృద్ధులకు సరుకులు పంపిణీ చేశారు. డాక్టర్ పి.వి.కె రెడ్డి, సిద్దారెడ్డి, ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అధికారులతో ఆర్డీవో సమీక్ష

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డివిజన్‌లోని రీసర్వేపై ఆర్డీవో కిరణ్‌కుమార్ సోమవారం సమీక్ష నిర్వహించారు. సర్వే, రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. సిజెఎఫ్ఎస్, అసైన్డ్ భూములు, సాగరమాల ప్రాజెక్టు, నడికుడి-కాళహస్తి రైల్వేలైన్ మండలాల్లోని ప్రభుత్వ భూముల వివరాలు, రీసర్వే, పిఓఎల్ఆర్, రబీ సేకరణ తదితర అంశాల పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా స్పందన కార్యక్రమం నిర్వహించి డివిజన్‌లోని ప్రజల సమస్యలపై వినతిపత్రాలను తీసుకున్నారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.



## రైల్వే అధికారులకు క్రికెట్ పోటీలు

నిరంతరం పని ఒత్తిడిలో ఉంటున్న రైల్వే ఉద్యోగులు క్రీడా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమని ఎంప్లాయిస్ సంఘ్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వరరావు తెలిపారు. అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో సోమవారం సౌత్‌సెంట్రల్ ఎంప్లాయిస్ సంఘ్ ఆధ్వర్యంలో మర్రి రాఘవయ్య క్రికెట్ టోర్నమెంట్‌ని నిర్వహించారు. పి.వి.రావు, నాగరాజు, శ్రీనివాస్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, కార్తీక్, రమణయ్య, కోటి, డిఆర్‌యూసీసీ సభ్యుడు బి.మయూరి శ్యాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 'లవకుశ'కు.. 60 ఏళ్లు

**'రామాయణం'ను తెలుగు చలనచిత్రంగా రూపొందించటం 1932లోనే ప్రారంభమైంది. 2023 మార్చి 29వ తేదీ నాటికి 'లవకుశ' చిత్రం విడుదల కావడం సినీరంగంలో ఒక విశిష్టమైన అంశం. ఒక్క మాటలో చెప్పాలంటే..'లవకుశ' ఓ అద్భుతం. అందులోని కథ, పాత్రలు, పాత్రధారులు, వారి నటనా వైభవం, కథను నడిపించిన తీరు..దర్శకత్వం..అన్నీ వేటికవే ప్రత్యేకం. ఉత్తర రామాయణ కథను నడిపిస్తూ, పూర్వ రామాయణాన్ని చెబుతూ, మొత్తంగా రామాయణాన్ని, అద్వితీయమైన రామకథను ఏనాటికీ మరపురాని, ఎప్పటికీ మరువలేని అత్యద్భుత చిత్రంగా తొలిసారి రూపొందించింది లవకుశ చిత్ర నిర్మాత, ప్రత్యేకించి మన నెల్లూరీయులు...అల్లారెడ్డి శంకరరెడ్డి కావడం సింహపురిసీమకే గర్వకారణం. 60 ఏళ్ల క్రితం ఆయన పడిన కష్టం..రాష్ట్రస్థాయిలోనే కాక జాతీయస్థాయిలో నేటికీ చిరస్మరణీయంగానే ఉంది. ఆ చిత్రంతో పాటు, చిత్ర నిర్మాత నేపథ్యం కూడా ఏనాటికీ మరువలేనిదే!**



అల్లారెడ్డి శంకరరెడ్డి. ఈ పేరు నెల్లూరుజిల్లాలో సుప్రసిద్ధం. నెల్లూరు జిల్లా, కోవూరు ఫిర్కా నాయుడుపాళెం అనే చిన్నగ్రామంలో, 1916లో సాధారణ రైతు కుటుంబంలో శంకర్‌రెడ్డి పుట్టారు. నెల్లూరు, మద్రాసు, కలకత్తా నగరాలలో ఎం.ఎ., బి.ఎల్ చదివారు. పారిశ్రామికవేత్తగా మారి నెల్లూరు సమీపంలో ముత్తుకూరు రోడ్‌లో నేషనల్ పిరమిడ్స్ అనే పింగాణి పరిశ్రమ స్థాపించారు. ఆ తర్వాత మైకా వ్యాపారం చేశారు. సంగీతం, సాహిత్యం పట్ల మొదట నుండి ఆయనకు మక్కువ ఎక్కువ. అప్పటి ప్రఖ్యాత రంగస్థల నటులు, సంగీతవేత్తలు బళ్లారి రాఘవ, ఋష్యేంద్రమణి, పర్వతరెడ్డి రామచంద్రారెడ్డి, నేలనూతల రామ కృష్ణయ్య, ఘంటసాల రాధాకృష్ణయ్యలాంటి వారితో ఆయన సన్నిహితంగా ఉండేవారు. వారి స్నేహ సౌరభాలతో 1950న సినీరంగ ప్రవేశంచేసి మానవతి, చరణదాసి సినిమాలను తీశారు. 1959 ఫిబ్రవరి 5న 'లవకుశ'ను ప్రఖ్యాత దర్శకులు సి.పుల్లయ్య దర్శకత్వంలో ప్రారంభించారు.



చిత్ర నిర్మాత శంకరరెడ్డిని అభినందిస్తున్న బెజవాడ గోపాలరెడ్డి

లవకుశ నిర్మాణం చేపట్టడానికి, అంతటి కావ్యాన్ని చిత్రమకుటంగా మలిచేందుకు ప్రధాన ప్రేరణ ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం ఒకటుంది. శంకరరెడ్డి చరణదాసి సినిమాలో, ఒక సన్నివేశానికి అనుగుణంగా సీతారాములుగా రామారావు–అంజలి అతిథి పాత్రలో నటించారు. అతిథి పాత్రలు అయినప్పటికీ ఆ సినిమాలో ఆ చిన్న సన్నివేశం ప్రేక్షకులకు ఎంతో ఆసక్తిగా మారింది. ఆ సినిమా విజయానికి అది కారణమైంది. ఇవన్నీ కాకుండా సీతారాములుగా వారిద్దరి జంట ముచ్చటగా ఉండి, శంకర్‌రెడ్డి అభిమానాన్ని పొందింది. మనసును తాకింది. వారిలో నిజమైన సీతారాము లను చూసిన శంకరరెడ్డి, విఖ్యాత నటులు ఎన్టీరామారావు, మహానటి అంజలితో ఎప్పటికైనా సినిమాను, అదికూడా పూర్తి నిడివి గల సినిమాగా రూపొందించాలని ఒక ఆలోచన వచ్చి అదే సంకల్పంగా మారిందని సినీ రంగంలో పలుమార్లు వారు చెప్పుకునేవారు.

చిత్రకీర్తి తెలుగు కీర్తిపతాకంగా నిలిచిన 'లవకుశ' నిర్మాణ సమయంలో 'సీతరాముల్లా'గా వారు కష్టనష్టాలు అనుభవించారని చెప్పేవారు. తెలుగు తమిళ భాషల్లో తొలిసారిగా రంగుల చిత్రంగా లవకుశను నిర్మించారు. ఈ చిత్ర నిర్మాణ ప్రారంభోత్సవానికి అక్కినేని, బి.ఎన్.రెడ్డి తదివతర సినీరంగ ప్రముఖులు హాజరైనారు. మొదట వేగవంతంగా నిర్మాణ పనులు జరిగాయి. ఆర్టిస్టుల డేట్స్ వలన రెండు భాషల్లో ఒకేసారి తీసేందుకు వీలు కాలేదు. మొదట ఈ సినిమా అనగానే చాలామంది మిత్రులు, సన్నిహితులు సినీ పరిశ్రమ వారు శంకరరెడ్డిని నిరాశపరిచారు. వెనకడుగు వేసేందుకు అత్యధికంగా కృషి చేశారు. నష్టపోతారు..అపకీర్తి వస్తుంది వంటి పదాలన్నీ కూడా శంకర్‌రెడ్డికి స్వాగతం పలికాయి. అయినప్పటికీ కూడా సంకల్ప బలం అనేది వారిని ముందుకు నడిపించింది. అప్పటికే 'శ్రీరామ పట్టాభిషేకం' కథ మార్పులు చేర్పులతో మూడు సినిమాలు విడుదలయ్యాయి. ఆ మూడు కూడా అపజయం పాలయ్యాయి. ఆ తర్వాత కాలంలో బి.ఎన్.రెడ్డి ఈ కథను సినిమాగా మార్చాలని స్క్రిప్టు కూడా సిద్ధం చేశారు. అయినప్పటికీ గత మూడు సినిమాల ఫలితాలు ఇవన్నీ కూడా ఆలోచింపచేశాయి. ధైర్యాన్ని ఇవ్వలేకపోయాయి. ముందుకు నడిపించలేకపోయాయి. దీనితో అర్ధాంతరంగా బి.యన్ రెడ్డి గారు ఆ సినిమా ఆలోచనను విరమించుకున్నారు. ఇలాంటి అనేక నేపథ్యాల నుంచి ఆత్మవిశ్వాసం, సంకల్పబలం వంటి బలమైన ఆయుధాలతో లవకుశ సినిమా నిర్మాణాన్ని ప్రారంభించారాయన.

## సంకల్పం..ఆత్మవిశ్వాసంతోనే ముందుకు :

1958 మార్చి 5న మద్రాసు విజయ వాహినీ స్టూడియోలో ప్రారంభించారు శంకరరెడ్డి. ప్రారంభం తర్వాత అత్యంత ఉత్సాహంగా వేగవంతంగా, నాణ్యతపరంగా ఎక్కడ కూడా రాజీ పడకుండా వేగవంతంగా సినిమాను, షూటింగును నడిపించారు. ఆ తర్వాత ఆర్థిక ఇబ్బందులు వలన ఆగిపోయింది. పట్టుదలకు ప్రతీకగా ఉంటూ, ఇష్టపడి నిర్మించాలనుకున్న లవకుశ ఆగిపోవటం ఇష్టం లేక, నెల్లూరొచ్చి డబ్బు సమకూర్చుకొని తిరిగి ప్రారంభించారు. ఇందుకు మూడేళ్ల వ్యవధి పట్టింది. తిరిగి చిత్ర నిర్మాణం 1961లో ప్రారంభించారు. ప్రారంభించిన కొద్ది సమయానికి మరొక పెద్ద అవాంతరం ఎదురయింది. దర్శకులు పుల్లయ్య అనారోగ్యం పాలు కావడం. కూర్చుంటే లేవలేక పోవడం, లేస్తే కూర్చోలేకపోవటం లాంటి ఆరోగ్య సమస్యల వలన చిత్ర నిర్మాణం మళ్ళీ కుంటుబడింది. అప్పటికి కేవలం 8వేల అడుగుల షూటింగ్ మాత్రమే జరిగింది. వారి కుమారుడు సి.ఎస్. రావును దర్శకుడుగా నియమించుకొని ఆ కష్టాన్ని అధిగమించారు. సిఎస్ రావు మిగిలిన 12 వేల అడుగుల నిర్మాణం పూర్తిచేశారు. చిత్ర నిర్మాణం ఆలస్యం వలన కొద్దిమంది నటుల శరీర ఆకారాలలో మార్పులు రావటం, ప్రేక్షకులు ఎలా ఆదరిస్తారోననే వేదనకు కూడా గురైనారు నిర్మాణకర్తలు. 1932 నుండి మూడు రామాయణ కథా చిత్రాలు విజయవంతం కాకపోవటం ఈ కథ ఎన్నుకోవటం కారణమని, ఇప్పటికైనా ఆ చిత్ర నిర్మాణం చేపట్టవద్దని మిత్రులు, శ్రేయోభిలాషులు తిరిగి వారించినా, పట్టుదల–ఆత్మవిశ్వాసంతోనే శంకరరెడ్డి తన కృషిని కొనసాగించారు. ఈ చిత్రం గేవా కలర్ కావటంతో లైటింగ్ ఎక్కువ అవసరమయ్యాయి. మేకప్‌లో మార్పులు తప్పని సరయ్యాయి. అందులో భాగంగా శక్తివంతమైన లైటింగ్‌ను వాడటం, ఆ వేడిని నటీనటులు తట్టుకోలేక పోవటంతో మళ్ళీ కొంత జాప్యం జరిగాయి. చివరలో భూమి విడిపోయి, సీతమ్మను భూదేవి తనతో భూమిలోకి తీసుకెళ్లే సన్నివేశాల్లో సాంకేతికంగా కొంత ఇబ్బందులు ఎదురైనా, జాప్యం జరిగినా సమస్యలన్నీ ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని, అచంచల విశ్వాసంతో పూర్తి చేయగలిగారు శంకరరెడ్డి.

## హాస్యనటుడు రమణారెడ్డికి అవకాశం

శంకరరెడ్డి తన తొలి చిత్రం 'మానవతి'లో మన నెల్లూరీయులు.. హాస్యనటులు రమణారెడ్డికి అవకాశం కల్పించారు. అంతేకాకుండా నెల్లూరు నుడికారాన్ని తొలిసారిగా వారిచే చిత్రాలలో ప్రవేశ పెట్టారు. మరో నెల్లూరీయుడు, విఖ్యాత రంగస్థల నటుడు పొన్నాల రామసుబ్బారెడ్డికి కూడా 'సతీ సావిత్రి' సినిమా ద్వారా అవకాశం ఇచ్చారు. ఎన్నో కష్టాలను, అవరోధాలను అధిగమించి 1963 మార్చి 29న లవకుశను విడుదల చేశారు. ఆ చిత్రం విడుదలై నేటికి ఆరు దశాబ్దాలు అవుతున్నా..నేటికీ లవకుశ ఓ అద్భుతచిత్రంగా..ప్రేక్షకుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయింది. సంచలన విజయాలెన్నో సాధించింది. అనేక భాషల్లో కూడా తర్జుమా అయి విజయం సాధించి పంపిణీదారులకు ఆర్థికబలం చేకూర్చింది. 'లవకుశ' చిత్ర నిర్మాతగా అల్లారెడ్డి శంకరరెడ్డికి ఆ చిత్రం అనంత కీర్తిని అందించింది. జాతీయ స్థాయిలో ఉత్తమ తెలుగు చిత్రంగా అప్పటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వద్ద నుంచి శంకరరెడ్డి బంగారు పతకం అందుకోవడం తెలుగు సినీరంగంలో మరో మరపురాని ఘట్టం. అప్పటి ఉత్తరప్రదేశ్ గవర్నర్, మన నెల్లూరీయులు బెజవాడ గోపాలరెడ్డి కూడా స్వయంగా ఒక సంచలన సినిమా నిర్మాతగా శంకర్‌రెడ్డిని ఆహ్వానించి సత్కరించడం కూడా అప్పట్లో భారతీయ చిత్ర పరిశ్రమలో మరో గొప్ప విశేషం. లవకుశ ఎన్నో సంచలన విజయాలకు మారుపేరైనా శంకరరెడ్డి జీవితంలో మాత్రం ఏ సంబరం మిగల్చలేదంటారు. ఆర్థికంగా ఆయన ఏమీ మిగుల్చుకోలేదని అంటుంటారు. అయినా, ఆయనేనాడూ ధనం కోసం వెంపర్లాడలేదు. ధనం మిగలకపోయినా.. అనంతమైన కీర్తిని, తరతరాల విఖ్యాతిని వారు సంపాదించుకున్నారు. అందుకే ఆయన నాటికీ, నేటికీ, ఏనాటికైనా.. అత్యద్భుతమైన 'లవకుశ' చిత్ర నిర్మాతగా..శంకరరెడ్డి చిరస్మరణీయులే!..



ఈతకోట సుబ్బారావు, ఫోన్: 9440529785

## టూకీగా...



### కలువాయమ్మ దేవాలయంలో.. అమావాస్య పూజలు

కలువాయి గ్రామశక్తి శ్రీ కలువాయమ్మ దేవాలయంలో మంగళవారం (ఈనెల 21) అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. గ్రామప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మహాగణపతి, నవ గ్రహ, మృత్యుంజయ, శ్రీ రాజరాజేశ్వరిదేవి మూలమంత్ర హోమాలను పెద్దఎత్తున నిర్వహించారు.

### బుచ్చిరెడ్డిపాళెంలో సామాజిక తనిఖీలు

బుచ్చిరెడ్డిపాళెం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఈనెల 21న సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం చేపట్టారు. పంచాయతీల్లో పనులకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ పీడీ నిర్మలాదేవి, ఏపీడీ మృతుల, డిబిఓ సురేష్‌బాబు, ఎంపీడీఓ నరసింహారావు, క్వాలిటీకంట్రోల్ ఇఇ వేణుగోపాల్, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

### ఊటుకూరులో 'పోషణ్ పక్వాడా' సంబరాలు

వింజమూరు మండలం ఊటుకూరు గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో ఈనెల 21న 'పోషణ్ అభియాన్', 'పోషణ్ పక్యాడా' పథకాల అమలును అధికారులు పరిశీలించారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాలను సంబరంగా జరిపారు. సర్పంచ్ ఆర్.వెంగమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుబ్బరత్నమ్మ, విజయ లక్ష్మి, చిన్నమ్మ, రాధ, ప్రతిమ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

### నెల్లూరులో ఉద్యోగినులకు క్రీడల పోటీలు

నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 21న మహిళా ఉద్యోగినులకు క్రీడల పోటీలు నిర్వహించారు. క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఆర్‌కె యతిరాజ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి. మెప్మా ఉద్యోగినులు, ప్రభుత్వ నర్సింగ్ విద్యార్థినులు, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

### కోవూరులో వీరాంజనేయస్వామికి ప్రత్యేకపూజలు

ఈనెల 21న ఫాల్గుణ అమావాస్య సందర్భంగా మండల కేంద్రమైన కోవూరులో వెలసివున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో అర్చకులు నాగరాజాచార్యులు సారథ్యంలో వేదపండితులు సుబ్బయ్యస్వామి, నందకుమార్‌స్వామి ఆధ్వర్యంలో స్వామివారికి శోభాయమానంగా అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం వేడుకగా పల్లకిసేవ నిర్వహించారు.

### బోగోలు మండలంలో ఆధార్ కేంద్రం తనిఖీ

బోగోలు మండలం ఏనుగులబావి సచివాలయంలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీదేవి ఈనెల 21న ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆ కేంద్రం పనితీరుపై ఎంపీడీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆధార్ స్పెషల్‌డ్రైవ్‌కి సంబంధించి ఆ కేంద్రంలోని సిబ్బందికి సూచనలు చేశారు.

### అప్పారావుపాళెంలో బాధితునికి సాయం

ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెరందిన ఏ.సురేష్‌కుమార్ కుటుంబానికి వైఎస్సార్ తక్షణ బీమా సాయం 10వేల రూపాయలను ఈనెల 21న స్థానిక వైకాపా నాయకులు పెమ్మసాని శ్రీనివాసులు నాయుడు అందజేశారు. సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ హరిబాబు, విఆర్‌ఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఇనమడుగులో పైలేరియా వ్యాధిగ్రస్తులకు సహాయం

కోవూరు మండలం ఇనమడుగు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఈనెల 21న 86 మంది పైలేరియా వ్యాధిగ్రస్తులకు ఆ కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎస్ రవిబాబు ఆధ్వర్యంలో మందులు, ప్లాస్టిక్ టబ్‌లు, మగ్గులు, టవల్స్ వగైరాలను పంపిణీ చేశారు. సిహెచ్‌ఓ నరసమ్మ, సూపర్‌వైజర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

### ఆధార్‌కార్డును అప్‌డేట్ చేసుకోండి

ఆధార్ కార్డు తీసుకుని పదేళ్ళు దాటిన వారంతా తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. మండల, గ్రామ సచివాలయాల్లో ఆధార్‌ను అప్‌డేట్ చేసుకునేందుకు ఈనెల 20, 21, 27 28 తేదీల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లను కూడా నిర్వహిస్తున్నామని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

## వీపీఆర్ సారథ్యంలో
# ముందస్తు ఉగాది వేడుకలు
## నెల్లూరులో నిర్వహించిన ప్రపంచ తెలుగు సమాఖ్య




ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో, సంస్థ ఉపాధ్యక్షులు రాజ్యసభ సభ్యులు, 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి సారథ్యంలో 'శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది' వేడుకలు మూడురోజుల ముందుగానే మార్చి 19వ తేదీ ఆదివారం, సాయంత్రం నెల్లూరులో జరిగాయి. వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్ ఈ వేడుకలకు వేదికయ్యింది. ఈ సందర్భంగా వివిధ సాహిత్య, సంగీత కార్యక్రమాలతో పాటు పంచాంగ శ్రవణం కూడా జరిగింది. అనంతరం ప్రపంచ తెలుగు సమాఖ్య అధ్యక్షురాలు వీ.ఎల్.ఇందిరాదత్ అధ్యక్షతన జరిగిన సభలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. ప్రపంచ తెలుగు సమాఖ్య రీజినల్ సమన్వయకర్త నలుబోలు బలరామయ్యనాయుడు పర్యవేక్షించారు.

సురభి గాయత్రి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నాట్యంతో కార్యక్రమం మొదలయ్యింది. ఆ తరువాత జరిగిన కే.ఎస్.రాఘవాచార్యుల పంచాంగ పఠనంలో శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఫలితాలను వివరించారు.

'తెలుగు భాషా వైభవం' పేరుతో ప్రదర్శించిన సాహిత్య రూపకం కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తెలుగు భాషకి ఉన్న ప్రాశస్త్యాన్ని, ప్రాముఖ్యతను, ప్రత్యేకతను ఈ రూపకం ద్వారా ప్రదర్శకులు తెలియచేశారు. ఆచార్య ఫణీంద్ర రూపొందించిన ఈ వైవిధ్య కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయలుగా మరుమాముల దత్తాత్రేయశర్మ, నన్నయగా డా.ఆచార్య ఫణీంద్ర, పాల్కుర్కి సోమనాథుడుగా ఆవుసుల భానుప్రకాష్, బమ్మెర పోతనగా పల్లెర్ల రామమోహన్‌రావు, విశ్వనాథ సత్యనారాయణగా డా. సంగనభట్ల నరసయ్య వేదికపై ప్రత్యక్షమై వారంతా స్వర్గలోకంలో కలుసుకుని తెలుగు భాషా వైభవాన్ని గురించి చర్చించుకుంటే ఎలావుంటుందో ఈ రూపకం ద్వారా కళాత్మకంగా ప్రదర్శించారు.







### నూతన సంవత్సర వేడుకలను ఉగాదినాడు జరుపుకుందాం - వీపీఆర్

"ఆంగ్ల సంవత్సరాన్ని అందరూ కొత్త ఏడాదిగా జరుపుకుంటున్నారు. వాస్తవానికి మనకు కొత్త సంవత్సరం వచ్చేది ఉగాది నుండి. ఇకపై ఉగాదిని కొత్త సంవత్సరంగా జరుపుకుందాం" అంటూ 'సేవాభూషణ్' వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పిలుపునిచ్చారు. "నాకు సేవాస్ఫూర్తిని కల్పించిన వారిలో ఇందిరాదత్ కూడా ఒకరు. గత 15 సంవత్సరాలుగా ఆమెను గమనిస్తూ.. వారి బాటలో నడుస్తున్నాను. గుప్తదానం వారి గొప్పతనం" అంటూ ప్రశంసించారు. "కలెక్టర్ చక్రధర్‌బాబు వంటి అంకితభావం కలిగిన అధికారి నెల్లూరు జిల్లాలో ఉండడం జిల్లా వాసుల అదృష్టం" అంటూ కలెక్టర్‌ని కీర్తించారు. "చక్రధరబాబు, బి.టెక్ (కంప్యూటర్ సైన్స్), ఎం.ఏ (పబ్లిక్ పాలసీ), ఎం.బి.ఎల్ (బిజినెస్ లా), మాస్టర్స్ డిగ్రీ ఇన్ ట్యాక్సేషన్ అండ్ బిజినెస్ లాస్ (బిజినెస్‌లా), ఎం.బి.ఏ(పవర్ మేనేజ్మెంట్) వంటి ఉన్నత చదువు చదివినా ఐ.ఏ.ఎస్‌లో తెలుగును ఒక సబ్జెక్ట్‌గా తీసుకొన్నారంటే తెలుగు భాష పట్ల ఆయనకున్న మక్కువ మనం అర్థం చేసుకోవచ్చు" అంటూ అభినందించారు. సమర్థనీయమైన సమన్వయకర్తగా నలుబోలు బలరామయ్యను వీపీఆర్ అభివర్ణించారు.

### తెలుగుకు ప్రాచుర్యం కల్పిస్తున్నాం - ఇందిరాదత్

ప్రపంచ తెలుగు సమాఖ్య ద్వారా విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగువారిలో ముఖ్యంగా యువతలో తెలుగు భాష పట్ల, సంస్కృతి, సంప్రదాయాల పట్ల, కళల పట్ల మక్కువ, అభిమానం కలిగించేలా ప్రపంచ తెలుగు సమాఖ్య కృషి చేస్తోందని సమాఖ్య అధ్యక్షురాలు వీ.ఎల్.ఇందిరాదత్ అన్నారు. ఉగాది, తెలుగువారికి ప్రత్యేక పండుగని, ఏడాదిలో వచ్చే పండుగలన్నింటిలోనూ తొలి పండుగని అన్నారు. ఉగాది అనగానే మనకు గుర్తుకు వచ్చేది ఉగాది పచ్చడని, విభిన్న రుచుల ఉగాది పచ్చడి సేవించడం ద్వారా మన జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను, లాభనష్టాలను, మంచి చెడులను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలనే సత్యాన్ని గ్రహిస్తున్నామని ఆమె అన్నారు. శ్రీ శోభకృత్ నామ ఉగాది వేడుకలు నెల్లూరులో చేద్దామని కోరిన వెంటనే తన అంగీకరాన్ని తెలియజేయడమే కాకుండా అన్ని ఏర్పాట్లను చకచకా చేసి, ఈ ఉగాది వేడుకలు నెల్లూరులో ఇంత ఘనంగా జరగడానికి కారణమైన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ప్రశాంతిరెడ్డి దంపతులకు ఇందిరాదత్ అభినందన కృతజ్ఞతలు తెలిపారు.

### సాహితీదిగ్గజాల నెలవు నెల్లూరు - చక్రధర్‌బాబు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ కచక్రధర్‌బాబు మాట్లాడుతూ, వైవిధ్యమైన రూపకం ద్వారా తెలుగు సాహిత్యం గురించి, తెలుగు కవులు గురించి తెలుసుకున్నామన్నారు. 9వ శతాబ్దం నన్నయ్య నుంచి 19వ శతాబ్దం విశ్వనాథ సత్యనారాయణ వరకు ప్రకాశింపచేసిన 1000సంవత్సరాల తెలుగు వెలుగు ఈరోజు ఇక్కడ కనబడటం, ఆనాటి పద్యాలు ఉగాది సంబరాలలో వినడం చాలా సందర్భోచితంగా ఉందన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లాలో మనం ఉగాది సంబరాలు చేసుకుంటున్న తరుణంలో ఖచ్చితంగా మనమందరం పొట్టి శ్రీరాములుని గుర్తు చేసుకోవాలన్నారు. తెలుగు భాష కోసం, తెలుగువారి హక్కులకోసం, తెలుగు జాతి గుర్తింపు కోసం తన ప్రాణాలను సైతం త్యాగంచేసిన మహనీయులు పొట్టి శ్రీరాములని కొనియాడారు. తెలుగు ఔన్నత్యాన్ని చాటే మహాభారతం రచించిన తిక్కనతో సహా ఎంతోమంది సాహితీ దిగ్గజాలకు నెల్లూరు నెలవు కావడం ప్రతి ఒక్కరూ గర్వించద గిన విషయమని చక్రధర్‌బాబు అన్నారు.

భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, తెలుగు వెలుగులను ప్రతిబింబిస్తూ జరిగిన ఈ ముందస్తు ఉగాది వేడుకకు పి.వి.సాయి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, నలుబోలు బలరామయ్యనాయుడు వందన సమర్పణ చేశారు.





తడ. మాంబట్టు ఏపిఐఐసి సెజ్‌లో ఈప్యాక్ పాలిమర్ పరిశ్రమకు ఇటీవల జరిగిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

## కలెక్టరేట్‌లో ఉత్సాహంగా ఉగాది



ఉగాది పర్వదినం సందర్భంగా ఈనెల 22న శ్రీ శోభకృత్ ఉగాది పంచాంగ శ్రవణం చేసిన బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణి శర్మను జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు సన్మానించారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఉన్న మహాకవి తిక్కన ప్రాంగణంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఆయనకు ఈ సన్మానం జరిగింది. ఈ సందర్భంగా పంచాంగంలోని పలు అంశాలను కలెక్టర్ ఆసక్తిగా విన్నారు. అనంతరం, ఉగాది వేడుకలను సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ పొట్లూరి స్రవంతి, కలెక్టర్ పాల్గొని అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఉగాది జిల్లా ప్రజలకు సకల శుభాలు కలిగించాలని, జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాంక్షించారు. సంప్రదాయ దుస్తులతో విచ్చేసిన కలెక్టర్‌ను అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించి ఆశీర్వదించారు. అనంతరం పలువురు కవుల కవితా గానంతో కవి సమ్మేళనం జరిగింది. చిన్నారులు తమ నృత్య విన్యాసాలతో అందరినీ అలరించారు. కవులను, కవయిత్రులను, కళాకారులను కలెక్టర్ సన్మానించారు. ఈ వేడుకల్లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ, మత్స్య-వ్యవసాయశాఖల జేడీలు నాగేశ్వరరావు, సుధాకర్‌రాజు, జిల్లా పర్యాటకశాఖ అధికారిణి కనకదుర్గాభవాని, బీసీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య, ఆర్టీఓ మలోల తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలో.. ఉగాది పండుగ



నెల్లూరులోని ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న ఉగాది పండుగ ఉత్సాహంగా జరిగింది. వాకర్స్ సంప్రదాయ దుస్తులతో వచ్చి పండుగ జరుపుకున్నారు. కె.ఎస్ రాఘవాచార్యులు పంచాంగశ్రవణం చేశారు. శ్రీ శోభకృత్ నామ ఉగాది అందరికీ శుభాలు చేకూర్చాలని వారు ఆకాంక్షించారు. వాకర్స్ సంఘం అధ్యక్షులు తలపనేని హరిబాబు ఆధ్వర్యంలో వాకర్స్‌ను ఉత్తరీయంతో సన్మానించి ఉగాది పచ్చడి, గుగ్గిళ్లు ప్రసాదంగా ఇచ్చారు. కార్యదర్శి రామమోహన్‌రెడ్డి, కోశాధికారి షేక్ నజీర్‌అహమ్మద్, వాకర్స్ ఇంటర్నేషనల్-2022 కోశాధికారి నలుబోలు బలరామయ్య నాయుడు, వాకర్స్ ప్రతినిధులు సాయిసుబ్బారావు, ఆదినారాయణరెడ్డి, రాజేంద్రప్రసాద్, మాగంటి ప్రసాద్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాగి జావ..ఆరోగ్యానికెంతో మంచిది



రాగి జావ రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుందని, ఆరోగ్యానికెంతో మంచిదని నెల్లూరులోని కొండాయపాలెం నగరపాలక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాగి జావ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. భాస్కర్‌రావు విద్యార్థులకు రాగి జావ అందజేశారు. ఉపాధ్యాయులు హరీష్, పేరెంట్స్ కమిటీ సభ్యులు విద్యా వలంటీర్లు వినీత, రాశి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈదూరు కోదండరామునికి..
# వసంత నవరాత్రోత్సవాలు



తోటపల్లిగూడూరు మండలం ఈదూరు గ్రామంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో మార్చి 22 నుంచి వసంత నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 1వ తేది వరకు ఈ వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయని ఆలయ అనువంశిక ధర్మకర్త రావి రామచంద్రయ్యనాయుడు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రావి మోహన్‌చౌదరి పేర్కొన్నారు. ఈ ఉత్సవాల సందర్భంగా 27వ తేది నుంచి 29 వరకు శ్రీ అభయాంజనేయస్వామివారికి ప్రత్యేకపూజలు జరుగుతాయని, 29న రాత్రి హనుమంతసేవ, 30న శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామునికి కల్యాణోత్సవం, గరుడసేవ నిర్వహిస్తామన్నారు. 31న స్వామివారి పట్టాభిషేక ఉత్సవం, ఏప్రిల్ 1న గంధపడి ఉత్సవం, ఏకాంతసేవ జరుగుతాయని తెలిపారు.

## దామరమడుగులో
# విద్యాపరికరాలు పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగు హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 80 మందికి ఇటీవల మెగాస్టార్ చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు మార్కెట్ సురేష్ దాతృత్వంతో పరీక్ష అట్టలు, పెన్‌లు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. విద్యార్థులంతా పదవ తరగతి పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించి, పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో.. ఆత్మకూరు సిఐ నాగేశ్వరరావు మృతి



ఆత్మకూరు సిఐ మల్లి నాగేశ్వరరావు (48) ఈనెల 20వ తేది గుండెపోటుతో మరణించడంతో పోలీసువర్గాల్లో విషాదం నెలకొంది. విధి నిర్వహణ అనంతరం మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వెళ్ళిన తర్వాత గుండెనొప్పితో కుప్పకూలిపోయారు. స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. చీరాలకు చెందిన ఆయన జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. ప్రజలతో స్నేహపూర్వకంగా ఉంటూ మంచిపేరు తెచ్చుకున్నారు. ఇటీవలే పదోన్నతిపై ఆత్మకూరు సిఐగా నియమితులయ్యారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ విజయారావు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆత్మకూరు డిఎస్పీ కోటారెడ్డి, పలువురు ఎస్ఐలు, ప్రముఖులు సిఐ మృతికి విచారం వెలిబుచ్చారు.

# చిగురేసే... మొగ్గేసే... సొగసంతా పుత(పూత)పూసే...!

ఏపీలోని 13 ఉమ్మడి జిల్లాల్లోని 9 ఉమ్మడి జిల్లాలకు చెందిన సుమారు ఏడు లక్షలమందికి పైబడిన పట్టభద్రులలో మొన్న ఓటు వేసిన వారిలో మెజారిటీ సభ్యులు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో వైసీపీ పట్ల తమ అసహనాన్ని వ్యక్తం చేశారు. ఈ 'అసహనం' ప్రతిపక్ష పార్టీగా ఉన్న టీడీపీకి కలిసి వచ్చింది. ఫలితంగా టీడీపీ అభ్యర్థులుగా పోటీచేసిన ఉత్తరాంధ్ర, తూర్పు రాయలసీమ, పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాల అభ్యర్థులు ముగ్గురూ విజయం సాధించారు.

ఇది తెలుగుదేశం పట్ల అభిమానంతో వేసిన ఓటు అనేకంటే... వైసీపీ పట్ల అసహనంతో పట్టభద్రులు వేసిన ఓటు అనడం సబబుగా ఉంటుంది.

వీరంతా చదువుకున్నవారు కావడం, నగదు బదిలీ పథకాల పరిధిలోకి వారిలో ఎక్కువమంది రాకపోవడం, ప్రభుత్వ నిర్వహణపై వారి మనోభావాలను గమనించాలనే ఆలోచనే ప్రభుత్వ పెద్దలకు ఉన్నట్టు కనపడకపోవడం మొదలైన కారణాల నేపథ్యంలో... పట్టభద్రులు తమ అసహనాన్ని ఈ ఎన్నికల రూపంలో వ్యక్తంచేశారు. 'ఇంత మందికి బటన్ నొక్కుతున్నారు. మరి మాకూ ఓ బటన్ నొక్కరా?' అంటూ గ్రాడ్యుయేట్లు అలిగారేమో తెలియదు. అందుకే, వైసీపీ తరఫున పోటీచేసిన ముగ్గురూ ఓడిపోయారు.

ఉపాధ్యాయుల లాగానో, ప్రభుత్వ ఉద్యోగుల లాగానో... కార్మికులలాగానో, ఏదో ఒక వృత్తికి పరిమితమైన వారిలాగానో... 'పట్టభద్రులు' అనేవారు ఒక వ్యవస్థీకృత గ్రూపు కాదు.

ఉద్యోగులు, నిరుద్యోగులు, చిరుద్యోగులు, వ్యవసాయదారులు, కూలీలు, చిన్న... చితక వ్యాపారులు, డబ్బులు ఉన్నవారు, లేనివారు, డబ్బు సంపాదనకు రాజకీయాలను వృత్తిగా ఎంచుకున్నవారు, గృహిణులు, కాబోయే గృహిణులు, అవివాహితులు, దొంగలు, రౌడీలు, పోలీసులు, న్యాయవాదులు, అన్యాయవాదులు, వారి మహారాజ పోషకులు... ఇలా సమాజంలోని సమస్త వర్గాలకు, కులాలకు, మతాలకు, రాజకీయ దృక్పథాలకు చెందినవారు, చెందనివారు ఓటర్లలో ఉంటారు. అందువల్ల, వీరు అంతా కలిసి 9 జిల్లాల్లోని ప్రజల మనోభావాలకు దర్పణంగా నిలుస్తారు.

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఎన్నికల్లో ఓటు వేసింది ఏడెనిమిది లక్షలమందే అయినప్పటికీ, ఓటర్‌గా నమోదుకాని వారు, బద్ధకిష్టులు... ఓటు వేయడానికి కుదరని వారు, వీలుపడని వారు మొదలైన గ్రాడ్యుయేట్లు అంతకు రెండు మూడు రెట్లకు పైబడి ఉంటారు.

వీరు చదువుకున్న ఓటర్లు. పాలను, నీటిని వేరు చేసి చూడగలిగిన సామర్థ్యం ఉండడానికి అవకాశం కలిగినవారు. అందువల్ల, ఆయా రాజకీయపార్టీల వ్యవహార శైలిపై వీరికి నిశ్చితమైన అంచనాలు ఉంటాయి. వీరి జీవిత భాగస్వాములు, ఓటు హక్కుకు వచ్చిన సంతానం, తల్లిదండ్రులు, అత్తమామలు, అన్నదమ్ములు, బావమరుదులు, దగ్గరి కుటుంబసభ్యులు, ఆత్మీయ స్నేహితులు మొదలైన వారిపై వీరి అభిప్రాయాలు గట్టి ప్రభావం చూపిస్తాయి. ఆ విధంగా... ఒక్కొక్క గ్రాడ్యుయేట్ ఓటర్ కనీసం పది, పదిహేను మంది ఓటర్లను ప్రభావితం చేస్తారు. ఇప్పుడు జరిగిన గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లు ఏడెనిమిది లక్షల మందే అనుకున్నప్పటికీ, వారు వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి దాదాపు ఒక కోటిమంది ఓటర్లను ప్రభావితం చేయగలుగుతారు. అంటే రాష్ట్రం మొత్తంమీద ఉండే ఓటర్లలో దాదాపు పాతిక శాతం మంది మస్తిష్కాలపై ఇప్పటి గ్రాడ్యుయేట్ ఎన్నికల ప్రభావం ఉంటుంది.

ఏ ఎన్నికల ఫలితాలనైనా అధికార, ప్రతిపక్షపార్టీలు తమదైన కోణంలో విశ్లేషించి చూడడం సహజం.

రాష్ట్రంలో అధికారపక్షమైన వైసీపీ ఈ ఎన్నికల ఫలితాలను "ఒక హెచ్చరిక" లాగా పరిగణించడం లేదని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. వీరు తమ ఓటర్లు కాదని కూడా ఆయన అన్నారు. పీడీఎఫ్, వామపక్షాల వారు ఓట్లు వేస్తే... టీడీపీ గెలిచిందని ఆయన సూత్రీకరించారు. అందువల్ల, టీడీపీ ఏదో కొత్తగా బలపడినట్టు గానీ, తాము బలహీనపడినట్టు గానీ కాదని ఆయన అన్నారు.

కానీ, టీడీపీ, వామపక్షాలకు మాత్రం ఈ ఫలితాలు కొత్త ఊపిరులూదాయి.

దాదాపు గత నాలుగు సంవత్సరాలుగా రాజకీయ, పోలీసు, అధికార జగన్నాథ రథచక్రాల కిందపడి నలిగిపోతున్నామని భావిస్తున్న టీడీపీ, వామపక్షాల వారికి నాలుగు రోజులు ముందుగానే శోభకృత్ నామ ఉగాది వేడుక వచ్చినట్టయింది.

ఎన్నికల ఫలితాల ఆధిక్యతలు వెలువడుతున్న సమయంలో టీడీపీ అభిమానులు... ఆయా ప్రాంతాలలో 'చిగురేసే... మొగ్గేసే... సొగసంతా పూత పూసే...' అంటూ డ్యాన్సులు, కేరింతలతో ఊగిపోయారు. మగవాళ్ళతో పాటు ఈసారి ఆడవాళ్లు కూడా 'ఊపేశారు'. తొడలు కొట్టారు. లేని మీసాలు మెలివేశారు.

వారి ఆనందోత్సాహాలు అర్థం చేసుకోతగినవే. నాలుగేళ్ల తరువాత టీడీపీ నేతల మొహాల్లో లైట్లు వెలిగాయి మరి.

ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ ఎన్నిక




విషయంలో వైసీపీ నేతలు కొంచెం ప్రెస్టీజ్‌కి పోయినట్టు కనపడింది. విశాఖకు రాజధానిని తరలించడానికి, ఈ ఎన్నిక ఫలితానికి వైసీపీ నేతలు లింకు పెట్టారు. ఈ ఎన్నికలో గెలిచి, 'విశాఖకు రాజధాని' ఐడియాను బలపరచాలని ఆ ప్రాంత వైసీపీ నేతలు గట్టిగానే ప్రచారం చేశారు. మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యనారాయణ, ఇతర నేతలు ఈ కోణంలోనే గట్టిగా ప్రచారం చేశారు. వై.వి. సుబ్బారెడ్డి స్వయంగా పరిస్థితిని పర్యవేక్షించారు.

కానీ, టీడీపీ అభ్యర్థి, గత రాజకీయానుభవం లేని ఓ ఎకనామిక్స్ మాస్టారు భారీ ఆధిక్యతతో గెలిచారు.

అంటే... విశాఖకు రాజధాని అనే ఆలోచనకు ఉత్తరాంధ్రవాసులు మద్దతు ఇవ్వలేదు అని అనుకోవాలా? లేక, దానికీ... దీనికీ సంబంధం లేదని అనుకోవాలా? ఎవరు ఎలా అనుకున్నప్పటికీ, ఆ ప్రాంతానికి చెందిన అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు మాత్రం వైసీపీపై చెలరేగిపోయారు. మరి, 'విశాఖకు రాజధాని' కాన్సెప్ట్‌కు మార్పులు, చేర్పులు ఏమైనా ఉంటాయేమో వేచిచూడాలి. ఉండకపోవచ్చు. ఎందుకంటే, తన అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి జగన్ మధ్యలో మార్చుకోరు అనేదే జనానికి ఉన్న అభిప్రాయం.

ఇక, రాయలసీమ విషయానికి వస్తే... 52 అసెంబ్లీ స్థానాలు కలిగిన రాయలసీమలో వైసీపీకి గత ఎన్నికల్లో 50 స్థానాలు వచ్చాయి. ముఖ్యమంత్రి జగన్ ఆ ప్రాంత వాసి. ప్రధాన సలహాదారు సజ్జల, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, సీ.ఎస్. జవహర్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొదలైన ప్రభుత్వ ముఖ్యులలో అత్యధికులు రాయలసీమవాసులు. అటువంటి రాయలసీమలోని రెండు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సీ స్థానాలలోనూ వైసీపీ విజయం సాధించలేదు.

అయితే, ఈ ఎన్నికల ఫలితాలు వైసీపీ పాలన, వ్యవహారశైలి, ఆలోచనా తీరుపై ఎటువంటి ప్రభావం చూపించకపోవచ్చునని సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలను బట్టి భావించవచ్చు. వీటిని ఆయన చాలా తేలిగ్గా తీసుకున్నట్టు కనపడింది. అంటే... గత నాలుగు సంవత్సరాలుగా జగన్ పాలన, వ్యవహారశైలి, ఆలోచనా సరళి రాష్ట్ర ప్రజలకు ఎలా కనపడుతూ వస్తుందో... ఈ మిగిలిన ఏడాదీ ఇంచుమించు అలాగే కనపడుతుందని భావించవచ్చు. తెలుగుదేశంలో మాత్రం ఆత్మవిశ్వాసం భారీగా పెరుగుతోంది అనడంలో సందేహం లేదు. మరింత ఉత్సాహంతో ఆ పార్టీ సార్వత్రిక ఎన్నికలకు సమాయత్తం అవుతుంది. లోకేష్ చేసే పాదయాత్రకు సైతం కొత్త గ్లామర్ వస్తుంది. ఇప్పటికే, లోకేష్ మొహంలో 'కొత్త గ్లామర్' కొట్టొచ్చినట్టు కనబడుతోంది.

ఇవన్నీ ఓ క్షణం అలా ఉంచితే... 'తెలుగుదేశం ఈసారి ఖాయం' అనే పబ్లిక్ పెర్సెప్షన్ రాష్ట్రంలో బలంగా వ్యాపించడానికి ఈ గ్రాడ్యుయేట్ ఎన్నికల ఫలితాలు బాగా దోహదం చేస్తాయి. తటస్థ ఓటర్లను ఈ పెర్సెప్షన్ బాగా ప్రభావితంచేసే అవకాశం ఉంది. 'జనసేనతో మాకు ఇప్పుడు పొత్తు అవసరం అంటారా?' అని ఒక టీడీపీ యాక్టివిస్ట్ సూరపనేని భారతీ చౌదరి ఇనుమడించిన ఆత్మవిశ్వాసంతో ఫోన్‌చేసి మరీ అడిగారు. అదీ... టీడీపీలో పెరిగిన ఆత్మవిశ్వాసానికి సూచిక.

ఈ ఎన్నికల ఫలితాలు వామపక్షాల అవసరాన్ని టీడీపీకి మాత్రం గట్టిగా గుర్తు చేస్తున్నాయి. వామపక్షాల ఓట్లు వేయడం వల్లే టీడీపీ గెలిచిందని సజ్జల కూడా సర్టిఫికెట్ ఇచ్చారు. పీడీఎఫ్ ద్వితీయ ప్రాధాన్యత ఓటు టీడీపీకి వేయించామని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దడాల సుబ్బారావు కూడా చెప్పారు. 'ఆ పని' మీదే ఓ పదిరోజుల పాటు ఆయన రాయలసీమలోనే మకాం వేశారు. వైసీపీ మాత్రం గెలవగూడదనే లక్ష్యంతో సీపీఎం ఈ ఎన్నికల్లో పని చేసింది. కనుక, వచ్చే ఎన్నికల్లో సీపీఐ, సీపీఎంను జాగ్రత్తగా చూసుకోవలసిన అవసరాన్ని ఈ ఎన్నికల ఫలితాలు తెలుగుదేశంకు గుర్తుచేస్తున్నాయి. తెలుగుదేశం మాత్రం బీజేపీ.. బీజేపీ అని పలవరిస్తోంది. ఆ బీజేపీకేమో ఉత్తరాంధ్రలో డిపాజిట్ కూడా రాలేదు. కనీసం, చెల్లని ఓట్లు వచ్చినన్ని కూడా బీజేపీకి రాలేదు.

ప్రస్తుతం బీజేపీ నేత మాధవ్ ఆ స్థానం నుంచి కౌన్సిల్‌లో సభ్యుడుగా ఉన్నారు. గతంలో వెంకయ్యనాయుడు, తెలుగుదేశం చెరో భుజం కాస్తే... ఆయన కౌన్సిల్ సభ్యుడుగా ఎన్నికయ్యారు. ఇప్పుడు వారు ఆయన పక్కన లేరు. అందువల్ల, యథావిధిగా ఆయనకు డిపాజిట్ కూడా దక్కలేదు. అయితే, బీజేపీ ద్వితీయ ప్రాధాన్య ఓట్లు మాత్రం టీడీపీకి భారీగాపడ్డాయి. వైసీపీకి పడలేదు. ఎందుకు పడలేదో... బీజేపీ నేతలు, నోటితో కాకుండా... మెదడుతో ఆలోచిస్తారేమో చూడాలి.

ఇక, జనసేన పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదు. ఈ ఎన్నికల్లో సొంత అభ్యర్థులను నిలబెట్టలేదు. టీడీపీకి ఓట్ వేయమని పవన్‌కళ్యాణ్ గానీ, నాదెండ్ల మనోహర్ గానీ వారి మద్దతుదారులకు విజ్ఞప్తి చేసినట్టు లేరు. వారి దృష్టి అంతా... రావలసి ఉన్న సార్వత్రిక ఎన్నికలపై ఉన్నదేమో! ఈ ఎన్నికల్లో మాత్రం జనసేనను ఎవరూ తలుచుకున్నట్టు కనపడడం లేదు. అయినప్పటికీ వామపక్షాలతో పాటు, జనసేనను కూడా కలుపుకు వెళ్ళడానికే ప్రాధాన్యం ఇచ్చింది అనే భావం ఓటర్లకు కలిగేలా తెలుగుదేశం వ్యవహరించాలి.

- భోగాది వేంకట రాయుడు
bhogadirayudu2152@gmail.com

# దేశ రక్షకుల పిల్లలకి ఉచిత శిక్షణ

## సిపాయిలకి 'విశ్వసాయి' వరం



నెల్లూరు, తిరుపతి నగరాలలో ప్రముఖ విద్యాసంస్థగా పేరు గడించిన విద్యాలయం విశ్వసాయి. ఇంటర్మీడియట్ విద్యతో పాటు వైద్యశాస్త్రం, ఇంజనీరింగ్ విభాగాలలో ప్రవేశ పరీక్ష కోసం శిక్షణ ఇచ్చి, తద్వారా వందలాదిమంది విద్యార్థినీ విద్యార్థులు డాక్టర్లుగా, ఇంజనీర్లుగా తయారవడానికి దోహదపడుతున్న అగ్రగామి సంస్థ ఇది. తాజాగా ఈ విద్యాసంస్థ సమాజం పట్ల నైతిక బాధ్యతతో ఒక కొత్త సంప్రదాయానికి నాంది పలుకబోతోంది. ఎముకలు కొరికే చలిలో ఎండనకా.. వాననకా పహారాకాస్తూ, తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి దేశ భద్రత కోసం సరిహద్దులో రక్షణగా ఉంటున్న సైనికుల కుటుంబాలకి చేయూతనందించడానికి ఈ విద్యాసంస్థ ముందుకొచ్చింది. సైన్యంలో పనిచేసేవారి పిల్లలకి ఇంటర్మీడియట్‌తో పాటు ప్రవేశ పరీక్షలకు శిక్షణ సైతం పూర్తిగా ఉచితంగా అందిస్తామని విశ్వసాయి సంస్థల వ్యవస్థాపకులు డా. ఎన్.సత్యనారాయణ తెలిపారు. సైన్యంలో పనిచేసి పదవీ విరమణ పొందినవారి చిన్నారులకు కూడా 50శాతం ఫీజులతో విద్యనందిస్తామని ఆయన చెప్పారు. మన దేశ రక్షణ కోసం అహరహం శ్రమిస్తూ సరిహద్దులో భద్రత కల్పిస్తున్న వారి కుటుంబాలకు భరోసా కల్పించాల్సిన అవసరం బాధ్యత కలిగిన ప్రతి భారతీయ పౌరుడిపైనా ఉందని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోదలచిన వారు తమ పూర్తి వివరాలతో నేరుగా తమ విద్యాసంస్థలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రతిభ, సమర్థత వున్న పేదవిద్యార్థులకు తనవంతు సాయం అందిస్తోంది విశ్వసాయి విద్యాసంస్థల యాజమాన్యం. ఇప్పుడు సైన్యంలో పనిచేస్తున్న వారి బిడ్డల భవిష్యత్తు కోసం కూడా సామాజిక బాధ్యతతో ముందుకు రావడం ఎంతో అభినందనీయం.

# ఒకేసారి 36 ఉపగ్రహాలు

## ముహూర్తం 26న

### షార్‌లో ప్రయోగానికి రాకెట్ సిద్ధం



శ్రీహరికోట నుంచి ఒకేసారి 36 ఉపగ్రహాలతో మరో రాకెట్ నింగిలోకి దూసుకుపోనుంది. బాహుబలిగా పేరొందిన ఎల్‌వీఎం3-ఎం3 రాకెట్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు అందుకు సిద్ధం చేస్తున్నారు. షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి ఈ ప్రయోగం జరగనుంది. ముహూర్తం ఈనెల 26వ తేది ఉదయం 9 గంటలకి. ఈనెల 25న కౌంట్‌డౌన్ ప్రారంభమవుతుంది. ఇస్రో ఛైర్మన్ డా.ఎస్ సోమనాథ్ నేతృత్వంలో శాస్త్రవేత్తలు ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. ఈ రాకెట్ ద్వారా యునైటెడ్ కింగ్‌డమ్ (వన్‌వెబ్ గ్రూప్ కంపెనీ) వన్‌వెబ్ ఇండియా-2 పేరుతో 5805 కిలోల బరువున్న 36 కమ్యూనికేషన్ ఉపగ్రహాలను అంతరిక్షంలోక పంపనున్నారు. ఇవన్నీ వాణిజ్యపరమైన ఉపగ్రహాలే. ఇస్రోలో అంతర్భాగమైన న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్ వారి నేతృత్వంలో ఈ ప్రయోగాన్ని నిర్వహించేందుకు శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



# వెంకయ్య ఇంట ఉగాది శోభ

**శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలు భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఇంట ఘనంగా నిర్వహించారు. ఢిల్లీలోని వారి నివాసంలో మార్చి 20న జరిగిన వేడుకలలో భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పలువురు కేంద్ర మంత్రులు, ఎంపీలు రాజకీయ, వ్యాపార ప్రముఖులు, వెంకయ్య కుటుంబసభ్యులు పాల్గొన్నారు.**



## శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి..

# 'ది మోస్ట్ ప్రామిసింగ్ బిజినెస్ లీడర్స్ ఆఫ్ ఆసియా' అవార్డు

శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి ప్రతిష్ఠాత్మకమైన 'ది మోస్ట్ ప్రామిసింగ్ బిజినెస్ లీడర్స్ ఆఫ్ ఆసియా' అవార్డు లభించింది. ఎకనామిక్ టైమ్స్‌కి చెందిన ET ఎడ్జ్ సంస్థ నిర్వహించిన 'ది ఎకనామిక్ టైమ్స్ ఏషియన్ బిజినెస్ లీడర్స్ కాంక్లేవ్ 2022-2023' 7వ ఎడిషన్ అవార్డ్స్ కార్యక్రమంలో ఆ అవార్డును ప్రదానం చేయడం విశేషం. ముంబైలో మార్చి 23 గురువారం ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. వ్యాపార విస్తరణలో దేశ విదేశాలలో పెను ప్రభావాన్ని చూపిన అసాధారణ నాయకత్వానికి గుర్తింపుగా ఈ అవార్డును అందించడం పట్ల పారిశ్రామిక రంగంలో హర్షం వెల్లువెత్తుతోంది.

### శ్రీసిటీ బృందానికి ఈ అవార్డు అంకితం

తనకు ప్రతిష్టాకరమైన 'ఎకనామిక్ టైమ్స్' అవార్డు రావడం పట్ల డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. దేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 'గ్లోబల్ బిజినెస్ హబ్'గా శ్రీసిటీని స్థాపించడంలో తమ బృందం చేసిన సమిష్టి కృషి, విశిష్ట ఆలోచనా విధానానికి గుర్తింపుగా దీనిని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దేశంలోని ప్రధాన కార్పొరేట్ గమ్యస్థానాలలో ఒకటిగా, విదేశీ బహుళ జాతి సంస్థల పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం గల భారతదేశంలోని 'తయారీకి 10 అత్యుత్తమ ప్రాంతాలలో' ఒకటిగా నిలిచిన శ్రీసిటీ, 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తితో నిజమైన చోదకశక్తిగా దేశ విదేశీ ప్రముఖ పరిశ్రమలకు పుట్టినిల్లుగా మారిందన్నారు. నేడు తనకు దక్కిన ఈ గౌరవాన్ని తమ బృందం మొత్తానికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. రవీంద్ర సన్నారెడ్డితో పాటు పలువురు కార్పొరేట్ లీడర్లు, దార్శనికులు, సంస్థల పురోగతిలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారిని ఈ కాన్క్లేవ్‌లో సత్కరించారు. మనీష్ తివారీ (అమెజాన్), అభిషేక్ గంగూలీ (ప్యూమా), సందీప్ సాంగ్వాన్ (క్యాస్ట్రోల్ ఇండియా) తదితర ఉద్దండ పారిశ్రామికవేత్తలు ఈ అవార్డులు లభించినవారిలో ఉన్నారు.




# ఆకట్టుకుంటున్న చేనేత వస్త్ర ప్రదర్శన

## రోజురోజుకీ పెరుగుతున్న విక్రయాలు



చేనేత వస్త్రాలు మన జీవన విధానంతో ముడిపడి మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబిస్తున్నాయి. నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఇటీవల ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి చేనేత వస్త్ర ప్రదర్శన చేనేత వస్త్రప్రియులను బాగా ఆకట్టుకుంటోంది. ఇందులో 80 స్టాల్స్‌ని ఏర్పాటుచేసి దేశంలో ఉన్న అన్ని రకాల చేనేత వస్త్రాలను ప్రదర్శిస్తున్నారు. చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ వస్త్ర ప్రదర్శనను ఇటీవల జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు ప్రారంభించగా, ఈ వస్త్ర ప్రదర్శనను మార్చి నెల 28వతేది వరకు సుమారు 14 రోజులపాటు కొనసాగించనున్నారు. దేశవ్యాప్తంగా బీహార్, జమ్మూకాశ్మీర్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలతో సహా తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన వెంకటగిరి, ధర్మవరం, పాటూరు, చీరాల, బాపట్ల, ఉప్పాడ, మంగళగిరి, పోచంపల్లి, గద్వాల్ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన చేనేత వస్త్రాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. పట్టు, కాటన్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్, షర్టు, ప్యాంట్ బిట్లు, దుప్పట్లు మొదలైన చేనేత వస్త్రాలు బయట మార్కెట్ కంటే చాలా తక్కువ ధరలకు అందుబాటులో ఉన్నాయి.

రోజురోజుకి కొనుగోళ్లు కూడా భారీగా పెరుగుతున్నాయి. ఈనెల 15వ తేదీన రూ. 4,62,900, 16న రూ. 7,02,800, 17న రూ. 5,94,700ల విలువైన చేనేత వస్త్రాలు అమ్మకాలు జరగడం విశేషం. చేనేత, జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఆనంద్‌కుమార్ పర్యవేక్షణలో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. వినియోగదారులను చేనేత వస్త్రాల వైపుకి ఆకర్షించాలన్న ముఖ్య ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, పూర్తిగా నూతన వెరైటీలు ఈ ప్రదర్శనలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రతి కొనుగోలు దారుడు ప్రత్యేక అనుభూతిని పొందేలా వస్త్రశ్రేణిని ఏర్పాటు చేశారు. రాష్ట్ర స్థాయిలో ఈ చేనేత వస్త్ర ప్రదర్శనను నెల్లూరులో ఏర్పాటు చేయడం జిల్లాకు ఎంతో గర్వకారణమని, ప్రతిఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకుని చేనేతకార్మికులకు అండగా నిలవాలని కలెక్టర్ కోరారు.



# రక్తదానం పట్ల ప్రజలో అవగాహన పెరగాలి

## నెల్లూరు డిఎస్పీ శ్రీనివాసరెడ్డి

రక్తదానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని, రక్తదానం గురించి ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు యువత బాగా కృషి చేయాలని నెల్లూరు డిఎస్పీ శ్రీనివాసరెడ్డి అన్నారు. నెల్లూరులో ఇటీవల 'లక్ష్యం ఫౌండేషన్' నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా పీఎంపీ అసోసియేషన్ సౌజన్యంతో, స్థానిక బుజబుజనెల్లూరులో హైవే వద్ద ఉన్న శ్రీరామాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయటం ద్వారా ప్రాణదాతలుగా యువత మారవచ్చని, రక్తదానం, ప్రాణదానంతో సమానమని చెప్పారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నిర్వాహకులను ఆయన అభినందించారు. కేంద్రప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయిసూరి, ఆకాష్ హాస్పిటల్ వైద్యులు డి.మధుసూదన్, వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ నాయకుడు అనుమల జయప్రకాష్, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి శాఖవరపు వేణుగోపాల్, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ షేక్ రసూల్, లక్ష్యం ఫౌండేషన్ ఛైర్మన్ చంద్రశేఖర్, సభ్యులు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3.
Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com